ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి





కలలు.. కల్లలయ్యాయి!

మెడికోలను చిదిమేసిన జలఖడ్గం

7

కలలు కల్లలయ్యాయి.. ఆశలు ఆవిరయ్యాయి.. చిన్నపాటి నిర్లక్ష్యం.. భవిష్యత్‌లో ఎంతో మందికి ఊపిరిపోయాల్సిన వారి ఊపిరినే తీసేసింది.. కుటుంబీకులకు తీరని శోకం మిగిల్చింది.. నిన్నటి వరకూ మా అమ్మాయి డాక్టర్ చదువుతుందంటూ ఎంతో గర్వంగా చెప్పుకున్న ఆ తల్లిదండ్రుల నోటమాట రావడంలేదు.. కళ్ల నుంచి ఉబికి వచ్చే కన్నీళ్లు ఆగడంలేదు.. తమ కళ్లెదుటే కొట్టుకుపోయారని.. ఎక్కడో ఒక చోట నుంచి తిరిగి వస్తారని ఆశగా ఎదురుచూసిన స్నేహితులకు కన్నీరే మిగిలింది.. తాము చూస్తుండగానే ఆనందంగా వాగులో దిగి గల్లంతైన ముగ్గురిలో ఇద్దరు విగతజీవులుగా కనిపించడాన్ని తట్టుకోలేకపోతున్నారు.. వెళ్లిపోదాం లేవండిరా అంటూ స్నేహితుల మృతదేహాలను పట్టుకుని వాళ్ల వెంట వచ్చిన స్నేహితులంతా కన్నీటిపర్యంతమయ్యారు. మారేడుమిల్లి జలతరంగిణి వాగు వద్ద క్షణాల్లో పెరిగిన నీటి ఉధృతికి ముగ్గురు ఆశ్రం మెడికల్ కాలేజీ విద్యార్థులు గల్లంతైన ఘటన విదితమే. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థినుల మృతదేహాలు లభ్యం కావడంతో ఆ ప్రాంతమంతా హృదయవిదారకంగా మారింది.. తోటి స్నేహితులు.. విద్యార్థినుల బంధువులను ఆపడం ఎవరి వల్లా కాలేదు.. మరొకరి ఆచూకీ ఇంకా లభించాల్సి ఉంది.



గల్లంతైన వారి ఆచూకీ కోసం సోమవారం వాగులో వెతుకుతున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది



సౌమ్య



అమృత



హరిదీప్

దీపావళి నుంచి మూడు సిలిండర్లు

'ఇది మంచి ప్రభుత్వం'లో మంత్రి దుర్గేష్

నిడదవోలు, సెప్టెంబరు 23 : అర్హులందరికీ దీపావళి నుంచి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించనున్నామని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు మండలం డి.ముప్పవరం గ్రామంలో సోమవారం "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమం నిర్వహించారు.ఇంటింటికి వెళ్లి స్వయంగా ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లు అతికించారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్లలో చేయలేని పనులు కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే చేసిందన్నారు.ఇది పేదల ప్రభుత్వమన్నారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాబోయే రోజుల్లో మరిన్ని మంచి పనులు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి దుర్గేష్, ఎంపీడీవో శామ్యూల్, తహశీల్దార్ నాగరాజు నాయక్, రంగా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నవరంలో.. అవినీతి!



దేవస్థానంలో నెయ్యికి 'నోట్ల' తడి




(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అన్నవరం దేవస్థానంలో వినియోగించే నెయ్యి నాణ్యతపై ఆలయ అధికారుల ఉదాసీనత అనేక అనుమానాలకు తావిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో అడ్డగోలు కంపెనీకి నెయ్యి సరఫరా కాంట్రాక్టు కట్టబెట్టిన ఆలయ అధికారులు అసలు నాణ్యతను పట్టించుకోలేదు. అంతేకాదు.. నెయ్యి నాణ్యతపై జిల్లా ఆహార కల్తీ నిరోధకశాఖ అనుమతులు లేవు. తాజాగా తిరుపతి లడ్డూలో వినియోగించి నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందని తేలిన నేపథ్యంలో అన్నవరంలో నెయ్యి నాణ్యతపై ఆరా తీస్తే అనేక చేదు నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అన్నవరం నెయ్యిని సైతం ప్రక్షాళనచేయాలని నిర్ణయించింది. కమీషన్లకు కక్కుర్తి పడి అనామక కంపెనీకి కట్టబెట్టిన నెయ్యి కాంట్రాక్టును పూర్తిగా తొలగించాలని భావిస్తోంది. ఇక ప్రభుత్వ డెయిరీ నుంచే నేరుగా నెయ్యి కొనుగోలు చేయాలని నిర్ణయించింది. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో విజయ డెయిరీని రంగంలోకి దించబోతున్నారు. ప్రస్తుత నెయ్యి నాణ్యత నిగ్గుతేల్చడానికి శాంపిళ్లను బెంగళూరు ల్యాబ్‌కు తరలించారు.

నెయ్యి పేరుతో నోట్లు మింగుడు...

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అన్నవరం దేవస్థానం ఎంతో ప్రఖ్యాతి చెందింది. ఏటా లక్షల్లో భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి వస్తారు. ఒక్క ప్రసాదమే ఏటా రెండు కోట్ల ప్యాకెట్లు అమ్ముడవుతాయి. ఇక్కడి ప్రసాదం అంటే భక్తులకు అంత ప్రీతి. అందుకే దేవస్థానంలో ప్రసాదం తయారీకి ఏటా 18 లక్షల కిలోల నెయ్యి అవసరం ఉంటుంది. కానీ అధికారులు ఈ నెయ్యిలో కోట్లలో నోట్ల వేట సాగించారు. ఆరు నెలలకోసారి ఒక్కొక్క కాంట్రాక్టర్ నుంచి నెయ్యి సరఫరా జరగాల్సి ఉంటే.. గత వైసీపీ ప్రభుత్వంలో ఓ అనామక కంపెనీ నుంచి ఏకంగా రెండేళ్ల పాటు అధికారులు నెయ్యి కొనుగోలు చేశారు.అసలు ఆ కంపెనీకి అంత నెయ్యి సరఫరా చేసే సామర్థ్యం లేకపోయినా కాంట్రాక్టు కట్టబెట్టేశారు. ఇదే కాంట్రాక్టరు పక్కనే సింహాచలం దేవస్థానానికి కిలో నెయ్యి రూ.344కి సరఫరా చేస్తే అన్నవరం దేవస్థానానికి ఏకంగా రూ.538కి విక్రయించారు. ఈ రెండేళ్లలో సదరు కాంట్రాక్టర్‌కు సింహాచలంతో పోల్చితే ఏకంగా రూ.7.80 కోట్ల వరకు గీకేశాడు. అంతేకాదు తాజాగా మరో కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. దేవస్థానానికి సరఫరా అయిన నెయ్యిని నిబంధనల ప్రకారం ఆలయ అధికారులు జిల్లా ఆహార కల్తీ నియంత్రణ శాఖ ద్వారా తనిఖీ చేయించాలి. నెయ్యి వచ్చిన వెంటనే ఆ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. అధికారులు వచ్చి నెయ్యి నాణ్యత పక్కాగా ఉందని ధ్రువీకరించిన తర్వాతే వినియోగించాలి.కానీ దేవస్థానం అధికారులు అసలు ఈ పని చేయలేదు.ఆ శాఖతో సంప్రదింపులు చేయ లేదు. నెయ్యి సరఫరా అయిన ప్రతిసారీ తనిఖీ చేయిస్తే ఎక్కడ నాణ్యత బయటపడి తమ బండారం బట్టబయలు అవుతుందోననే భయంతో అడ్డగోలుగా వ్యవహరించారు. పూర్తిగా నిబంధనలకు తూట్లు పొడిచారు. అనామక నెయ్యి సరఫరా కాంట్రాక్టరు తనకు అనుకూలంగా తెచ్చుకున్న దొంగ నాణ్యత సర్టిఫికెట్‌నే నమ్మి నెయ్యి కొనుగోలు చేయడం అనేక అనుమానాలకు తావిస్తోంది. అసలే ఆరు నెలలకోసారి మారాల్సిన కాంట్రాక్టర్ మారకపోవడం, ఇతర ఆలయాలతో పోల్చితే అధిక చెల్లింపులు, పైగా నెయ్యికి తనిఖీలు చేయించకపోవడం వెనుక ఎన్ని కోట్ల లో కమీషన్లు చేతులు మారాయనేదానిని రుజువు చేస్తోంది.



- నెయ్యి నాణ్యతపై అనుమతులు నిల్
- జిల్లా ఆహార కల్తీ నిరోధకశాఖ తనిఖీలేవీ
- నేటికీ అనామక కంపెనీ నుంచే నెయ్యి
- కాంట్రాక్టర్లకు అడ్డగోలుగా సహకారం
- తిరుపతి ఘటనతో మేల్కొన్న ప్రభుత్వం
- నెయ్యి సరఫరాలో సమూల మార్పులు
- ప్రస్తుత కంపెనీని తప్పించాలని నిర్ణయం
- వచ్చే నెల నుంచి కొత్త కాంట్రాక్టర్ రాక
- ఇకపై విజయ డెయిరీ నెయ్యి కొనుగోలు?
- సింహాచలానికి విశాఖ డెయిరీ నెయ్యి
- డిప్యూటీ సీఎం పవన్‌తో చర్చలు
- అన్నవరం నెయ్యి శాంపిళ్లు బెంగళూరుకు
- మరో 20 రోజుల్లో రానున్న నివేదిక

ఇకపై సమూల మార్పులు..

తిరుపతి లడ్డు తయారీలో గత వైసీపీ ప్రభుత్వం జంతు కొవ్వులు కలిసిన నెయ్యిని వినియోగించిన ఘటన బట్టబయలు కావడంతో రాష్ట్రప్రభుత్వం అప్రమత్తమైంది. అన్నవరం దేవస్థానంలోను ఇకపై నెయ్యి నాణ్యత పెంచాలని నిర్ణయించింది. వైసీపీ హయాం నుంచి అడ్డగోలుగా కొనసాగుతున్న ప్రస్తుతం రైతు డెయిరీ కాంట్రాక్టర్‌కు నెయ్యి సరఫరా గడువు ఈనెలతో ముగుస్తోంది. తిరిగి వచ్చే నెల నుంచి మరో కొత్త కాంట్రాక్టర్ రంగంలోకి దిగుతున్నారు. ఈలోపే నెయ్యి నాణ్యతపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోబోతోంది. అందులో భాగంగా ప్రభుత్వ విజయ డెయిరీ నుంచి మొత్తం నెయ్యిని కొనుగోలు చేయాలని దాదాపు నిర్ణయానికి వచ్చింది. ఈ మేరకు జిల్లా మంత్రి అయిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి విజయ నుంచి నెయ్యి కొనుగోలు ప్రతిపాదన తీసుకువెళ్లారు. అదే సమయంలో సింహాచలం దేవస్థానానికి అన్నవరం ఆలయానికి సరఫరా చేస్తున్న కాంట్రాక్టరే నెయ్యి సరఫరా చేస్తుండడంతో ఆయన్ను తప్పించి విశాఖ డెయిరీ నుంచి కొనుగోలు చేయాలని సోమవారం నిర్ణయం తీసుకున్నారు.ఈ నేపథ్యంలో పవన్ దృష్టికి ఈ వ్యవహారాన్ని తీసుకువెళ్లబోతున్నారు. తద్వారా విజయ, విశాఖలో ఏదనేది నిర్ణయించనున్నారు. విజయ డెయిరీ వైపే మొగ్గు చూపే అవకాశాలున్నాయి. అన్నవరం దేవస్థానంలో జిల్లా ఆహార కల్తీ నిరోధకశాఖ అధికారులు ఆదివారం తనిఖీలు చేసి నాలుగు నెయ్యి శాంపిళ్లు సేకరించారు. నాణ్యతను నిగ్గు తేల్చడానికి హైదరాబాద్‌లోని స్టేట్ ల్యాబ్, మరింత లోతైన విశ్లేషణకు బెంగళూరులోని కేంద్ర ల్యాబ్‌కు పంపించారు. 20 రోజుల్లో వీటికి సంబంధించి పూర్తిస్థాయి నివేదికలు రానున్నాయి.

కాకినాడ కలెక్టర్ ఆగ్రహం..

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ నెయ్యి నాణ్యత విషయమై ఆగ్రహంగా ఉన్నారు. ఇప్పటికే జిల్లా ఆహారకల్తీ నియంత్రణశాఖ అధికారులను పిలిపించి మాట్లాడగా అసలు నెయ్యి నాణ్యతపై ఏ రోజూ తమ ద్వారా తనిఖీలు జరగలేదనే విస్తుగొలిపే వాస్తవాలు బయటకు వచ్చాయి. తమకు దేవస్థానం నుంచి అసలు ఎప్పుడూ సమాచారం లేదని కలెక్టర్‌కు వివరించారు. ఒకరకంగా ఇది పూర్తిగా నిబంధనల ఉల్లంఘనే అని తేల్చిచెప్పాలి. తిరుపతి ఘటన నేపథ్యంలో ఇకపై ఆలయానికి వచ్చే నెయ్యిని ఆహార కల్తీ నియంత్రణశాఖ అనుమతించి పక్కాగా ఉందని నిర్ధారించిన తర్వాతే వినియోగించేలా జిల్లా ఆహార కల్తీ నిరోధక శాఖ ఆలయ ఈవోకు రాతపూర్వకంగా లేఖ రాయబోతోంది.





అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్నరాముడు..

అర్జీదారులతో కిక్కిరిసిన కలెక్టరేట్ ప్రాంగణం

కలెక్టరేట్‌కు అర్జీదారుల క్యూ

- కొత్త పింఛన్లు, రేషన్‌కార్డులు ఇప్పించాలని వినతులు
- 450 మంది నుంచి అర్జీలు స్వీకరించిన కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ/రూరల్ ,సెప్టెంబరు 23 : కలెక్టరేట్‌కు కొత్త పింఛన్లు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని కోరుతూ పలువురు అర్జీదారులు పోటెత్తారు. గత మూడు వారాలుగా ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సక్రమంగా జరగడం లేదు. ఒక వారం వర్షాభావం కారణంగా ప్రజలు రాలేకపోయారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "మీ కోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా పలు మండలాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున చేరుకున్నారు. కలెక్టరేట్ వద్ద ప్రజలు బారులు తీరారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 450 మంది నుంచి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జేసీ చిన్నరాముడులు అర్జీలు స్వీకరించారు.కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

- చాగల్లు మండలం దారవరానికి చెందిన పాతూరి సుబ్బారావు తమ గ్రామ నెం-1 స్కూల్‌లో విద్యార్థులకు తగ్గట్టుగా టీచర్లు లేరని కేవలం ముగ్గురు ఉపాధ్యాయులతో కాలం వెళ్లదీస్తున్నారని వినతిపత్రం ఇచ్చారు.
- నిడదవోలు బాలికల హాస్టల్ వార్డెన్ రాజామణి విద్యార్థులకు సక్రమంగా భోజనాలు పెట్టడం లేదని ఫిర్యాదు చేశారు.ముప్పవరం గౌడ్‌పేటకు చెందిన పి.సత్యనారాయణ గ్రామంలో చెరువుగట్టున సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహాన్ని పెట్టుకునేందుకు అనుమతివ్వాలని కోరారు.
- దేవరపల్లికి చెందిన భూపతిరాజు కొవ్వూరు డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.అతనికి అనారోగ్య సమస్యలతో ఉండగా డిపో మేనేజరు చార్టుకు విరుద్ధంగా డ్యూటీలు వేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు.
- సీతానగరం మండలం బొబ్బిలంక సర్పంచ్ మొల్లి రామచంద్రరావు ఇటీవల వచ్చిన గోదావరి వరదలకు శ్మశాన వాటిక కోతకు గురైందన్నారు. ప్రస్తుతం గ్రామంలో సుబ్బారావుపేట, జేజే నగర్, అశోక్‌నగర్‌లకు చెందిన దళితులు ఎవరైనా మరణిస్తే అంతిమ సంస్కారాలకు ఇబ్బందులు పడుతున్నామన్నారు.
- పలువురు దివ్యాంగులు రూ.15 వేల పింఛను మంజూరు చేయాలని అర్జీలు పెట్టుకున్నారు.



కలెక్టరేట్‌లో మొక్కనాటుతున్న కలెక్టర్ ప్రశాంతి, గోరంట్ల

ప్రతి మండలంలో మొక్కలు నాటేందుకు

25 సెంట్ల స్థలం సేకరించాలి..

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 23 : పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా అకీరా మియావాకీ కార్యక్రమాన్ని చేపట్టినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 2600 మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఉపాధి హామీ పథకం కింద అకీరా మియావాకీ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. కనీసం ప్రతి మండలంలో ఐదు నుంచి పది వరకు ప్రదేశాలను గుర్తించి కనీసం 25 సెంట్ల స్థలంలో ఈ మొక్కలు పెంపకానికి చర్యలు తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో డీఆర్వో జి.నరసింహులు, డ్వామా ఇన్‌చార్జి పీడీ ఆర్.శ్రీరాములు,జిల్లా అధికారులు ఎస్.మాధవరావు, ఎన్‌వీవీఎస్.మూర్తి, జి.స్వామినాయుడు, కెఎస్.జ్యోతి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో నాకిది.. నీకది..?

బదిలీల్లో వినూత్నంగా పంపకాలు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 23 : రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో బదిలీలు వినూత్నంగా సాగాయి. ఒకరికొకరు సర్దుబాటు చేసేసుకున్నారు. నీకది.. నాకిది అంటూ పంచేసుకున్నారు.తమకు నచ్చినసీటు.. ఇబ్బందిలేకుండా సాధించుకున్నారు.బదిలీలంటే ఇలా కూడా జరుగుతాయా అని ఆశ్చర్యపోయేలా రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో జరిగాయి. అసలేం జరిగిందటే..ప్రస్తుతం రాజమహేంద్రవరం కార్పొరేషన్ సిటీ ప్లానర్‌గా మూర్తి పనిచేస్తున్నారు. ప్రస్తుత బదిలీల్లో భాగంగా ఆయనను రాజమహేంద్రవరం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు.ఆయన స్థానంలో రుడా పీవో కోటయ్యను టౌన్‌ప్లానింగ్ సిటీప్లానర్‌గా నియమించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్లుగా పనిచేస్తున్న కృష్ణ, హరిబాబు, అనితాజూలీ బదిలీ అయ్యారు. వీరిలో అనితాజూలీ రుడాకు బదిలీ అయ్యారు. కృష్ణను టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్‌కు బదిలీ చేశారు. హరిబాబు విజయనగరం మునిసిపాలిటీకి బదిలీ అయ్యారు. అంటే వీరిలో కేవలం ఒక్కరు మాత్రమే విజయనగరం వెళ్లారు. మిగిలిన వారంతా ఇక్కడే ఉండడం గమనార్హం. ఈ విషయం తెలిసినవారంతా బదిలీలు ఇలా కూడా జరుగుతాయా అని ఆశ్చర్యపోతున్నారు.

మైన్స్ ఏడీగా ఫణిభూషణ్‌రెడ్డి

జిల్లా మైన్స్ ఏడీగా డి.ఫణిభూషణ్‌రెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుత ఏడీ ఎం.సుబ్రహ్మణ్యం ఆర్‌వీఎస్‌గా (రీజనల్ విజిలెన్స్ స్క్వాడ్) బదిలీ అయ్యారు. తూర్పుగోదావరి జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారిగా డి.ఫణిభూషణ్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయన శ్రీకాకుళం నుంచి ఇక్కడకు వస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ మైన్స్ అండ్ జియాలజీ అధికారిగా ఉన్న ఎం.సుబ్రహ్మణ్యంను కడపకు బదిలీ చేశారు.



నేటి నుంచి పొలం పిలుస్తోంది

- వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల క్షేత్ర సందర్శన
- ఇకపై వారంలో రెండు రోజులు నిర్వహణ

రాజానగరం, సెప్టెంబరు 23 : వరి సాగులో తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం "పొలం పిలుస్తోంది" కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా వారంలో ప్రతి మంగళ, బుధవారాల్లో రోజుకు రెండు గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించేలా ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ శాఖలైన మత్స్య, ఉద్యాన, పట్టు, పరిశ్రమ,సేంద్రియ, మార్కెటింగ్ శాఖల అధికారులు పొలంబాట పట్టే దిశగా ప్రభుత్వం సంకల్పించింది. ఆధునిక పంటలపై దృష్టి సారించేలా చర్యలు చేపట్టడంతో పాటుగా సంబంధిత వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నదాతలను కలిసి సాగు కష్టాలు తెలుసుకుని నూతన దిగుబడులపై అవగాహన కల్పిస్తారు. ఖరీఫ్, రబీ సాగుల్లో నాలుగు నెలల వంతున "పొలం పిలుస్తోంది" నిర్వహించేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. అధికారులు రైతు వద్దకు వెళ్లి పంట పరిశీలనతో పాటు లోపాలు గుర్తిస్తారు. ఈ వివరాలు రాష్ట్రస్థాయి అధికారులు పరిశీలించనున్నారు. పంట దిగుబడి తగ్గడానికి కారణాలు తెలుసుకోవడం, సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి భూసారం పెంచేలా సూచనలు చేయడం, భూసార కార్డుల పంపిణీ, తుంపర, బిందు సేద్యం పథకం దిశగా ప్రోత్స హించడం చేస్తారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీ, రైతు మిత్ర సంఘాల ఏర్పాటు, వ్యవసాయ సంఘాల ద్వారా రుణాలు మంజూరు, ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించడం, రసాయన ఎరువుల వినియోగం తగ్గించేలా అవగాహన కల్పించనున్నారు. వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉన్న 14 శాఖల సేవలు వినియోగించుకోవాలని ప్రభుత్వం సూచించింది. రాజానగరం వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిం మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు.



'విషాద' కేంద్రాలు!

- మన్యం పర్యాటకంలో తరచూ ప్రమాదాలు
- వాగులు, జలపాతాల్లో దిగి మృత్యువు ఒడిలోకి
- ఆనందంతో వచ్చి.. కన్నీటితో వీడ్కోలు
- పర్యాటకుల భద్రత సైతం గాలికి
- ప్రమాదకర ప్రాంతాల్లో వీక్షణకే పరిమితం చేస్తే కొంత మెరుగు

(రంపచోడవరం)

మన్యంలో అడ్డతీగల మండలం పింజరికొండ, రంపచోడవరం మండలం సీతపల్లి వాగు, భూపతిపాలెం ప్రాజెక్టు, మారేడుమిల్లి మండలం పాములేరు వాగు, ఇపుడు కొత్తగా జలతరంగిణి జలపాతం, అటుపైన ఘాటీలో మరొక జలపాతం ఉండగా చింతూరు మండలం మోతుగూడెం జలపాతం, సోకులేరు వాగు వీటి అన్నిటికీ మించి గుడిసె హిల్ స్పాట్... ఇలా అనేక ప్రకృతి ఇచ్చిన పర్యాటక కేంద్రాలు రాష్ట్రం నలుమూలల నుంచి పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా అటవీశాఖ నిర్వహిస్తున్న ఎకో టూరిజం ప్రాజెక్టులను కేవలం ఆదాయ వనరులుగానే మార్చుకుంటు న్నారు తప్ప, అక్కడికి వచ్చే పర్యాటకుల రక్షణను మాత్రం గాలికొదిలేశారు. ఇదే పర్యాటకులకు ప్రాణగండంగా మారింది. ఎందరో యువతీ, యువకులు వాగుల్లో పడి మృతి చెందారు. అయినాగానీ ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. గత కొన్ని రోజులుగా ఈ ప్రాంతంలో పర్యాటకాన్ని భారీవర్షాలు, ప్రకృతి విపత్తులరీత్యా ఐటీడీఏ, రెవెన్యూశాఖ కొంతకాలంపాటు నిషేధం విధించాయి. కానీ పర్యాటకులు ఈ నిషేధాన్ని ఉల్లంఘించి మరీ మన్యంలోకి వస్తున్నారు. దీనికితోడు ఆయా కేంద్రాల వద్ద కూడా పోలీసు పహారా లోపించడంతో పర్యాటకులను అడ్డుకునే వారే లేకుండా పోయారు. మరోవైపు అటవీ శాఖ ఆధ్వర్యంలో నడిచే ఎకో టూరిజం పర్యాటక కేంద్రాలను మాత్రం ఆ శాఖ కొనసాగిస్తూనే ఉంది. దీంతో అటవీశాఖ నిర్వహించే పర్యాటక కేంద్రాల్లో నిషేధం అమలులో లేనట్టే. మారేడుమిల్లి జలతరంగిణి జలపాతానికి పర్యాటకులను అనుమతిస్తూ టికెట్లను విక్రయించడమే ఆదివారం నాటి ఘటనకు కారణమైంది. ఎక్కడి నుంచో వచ్చిన మెడికల్ విద్యార్థులను నిరోధించాల్సిన అటవీశాఖ అధికారులు, టికెట్ల ఆదాయం కోసం వారిని జలతరంగిణిలోకి అనుమతించడమే ప్రమాదానికి కారణమైంది. ఈ జలతరంగిణి జలపాతం ఇటీవల భారీ వర్షాలు, వరదలతో నాచు పట్టి ఉండడంతో అక్కడ అడుగుపెడితే చాలు.. కాలికి పట్టు లేకుండా జారిపోవడంతో పాటు ఆకస్మికంగా భారీస్థాయిలో వరద జలాలు జారిపడుతుండడంతో ఆ సమయంలో ఉన్నవారెవరైనా వాగులోకి జారి కొట్టుకుపోవడం ఖాయంగా మారింది. ఈ ప్రాంతాల్లో జలపాతాలు ప్రమాదభరితంగా ఉన్నాయని తెలిసినా ఎవరూ జలపాతాల వైపు రావద్దని అధికారులు నిరోధించడం లేదు. అంతేకాదు ప్రమాదభరితంగా ఉన్నాయన్న సంకేతాలను కూడా అక్కడ ప్రదర్శించలేదు. పాములేరులో కూడా మొసళ్లు ఉన్నాయని ప్రమాద హెచ్చరికలు చేస్తున్నారేతప్ప వాగు ప్రమాదభరితంగా ఉందని మాత్రం ఎవరూ చెప్పడం లేదు. పింజరికొండ విషయంలో అయితే ఎటువంటి హెచ్చరికలూ ఉండవు. సీతపల్లిలో స్థానికులు వారించినా పర్యాటకులు ఆగడం లేదు. ప్రభుత్వం ఇకనైనా ఇక్కడి పర్యాటకంపై దృష్టిసారించాల్సి ఉంది. పర్యాటక ప్రాంతాల అభివృద్ధితోపాటు పర్యాటకుల రక్షణ బాధ్యత కూడా పూర్తిస్థాయిలో చేపడితేనే ఇలాంటి ఘటనలకు ఆస్కారం ఉండదు. మన్యంలో పర్యాటకంలో వాగుల్లో, జలపాతాల్లో స్నానాలకు అవకాశం లేకుండా చర్యలు చేపట్టి, కేవలం వీక్షణకే పరిమితం చేయాలని పలువురు కోరుతున్నారు.

మన్యంలోని జలపాతాలు, కొండవాగులు పర్యాటకులను ఎంతగా ఆకట్టుకుంటున్నాయో అంతకుమించి పర్యాటకులను మింగేసే మృత్యుకుహరాలుగా మారాయి. ఈ పర్యాటక కేంద్రాల్లో సరైన భద్రత, రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో పర్యాటకులను తరచూ బలితీసుకుంటున్నాయి. ఆదివారం నాడు మారేడుమిల్లి మండలం అటవీశాఖ నిర్వహిస్తున్న జలతరంగిణి జలపాతంలో ఇద్దరు మెడికోలు మృతి చెందగా, మరొక విద్యార్థి గల్లంతైన ఘటన నేపథ్యంలో మన్యం విహార కేంద్రాల రక్షణ చర్చనీయాంశంగా మారింది.



భవిష్యత్ తరాలకు మంచి వైద్య సేవలు అందించే వైద్యురాలిగా నా బిడ్డను చూడాలనుకున్నాను. కానీ ఇంతలోనే ఘోరం జరిగిపోయింది. **రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వద్ద అమృత తండ్రి బాలి శ్రీనివాసరావు ఆవేదన**



తలకు బలమైన గాయాలు కావడంతో చివరిసారిగా ముఖం చూసేందుకు కూడా అవకాశం లేదు. ఈ దుర్ఘటన గురించి తెలిసిన తర్వాత సౌమ్య తల్లిదండ్రులు అనారోగ్యంతో ఇంటికే పరిమితమయ్యారు.
సౌమ్య మేనమామ మచ్చ ఆదినారాయణ



కుమారుడు హరదీప్ ఆచూకీ తెలియకపోవడంతో కొండవాగుల వద్ద ఆందోళనగా తండ్రి రవి ప్రసన్న

మెడికోలను చిదిమేసిన జలఖడ్గం

- కొండ రాళ్ల తాకిడికే మృత్యువాత
- ఒకరి తలకు, నుదిటికి తీవ్ర గాయాలు
- మరొకరి ముఖం ఛిద్రం
- జలతరంగిణి సృష్టించిన విలయం
- ఏడడుగుల ఎత్తులో ప్రవాహం
- ఇప్పటికీ కురుస్తున్న వర్షం
- ఇద్దరు విద్యార్థినుల మృతదేహాలు లభ్యం
- మరొక విద్యార్థి కోసం గాలింపు
- రంగంలోకి ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు



మారేడుమిల్లి, సెప్టెంబరు 23: ఆనందంలో మునిగితేలుతున్న ఆ క్షణాలు.. వారికి చివరి క్షణాలయ్యాయి. వైద్య విద్యతో ఒకరికి ప్రాణదానం చేయాల్సిన వీరిని మృత్యువు.. క్షణాల్లో విగతజీవులుగా మార్చేసింది. నిజానికి ప్రకృతి సోయగాలకు అసలైన అందం జలపాతాలే. కొండకోనల్లోంచి పొంగిపొర్లుకుంటూ వాగుల్లోకి వచ్చే దృశ్యాలను వీక్షించేవారు కొందరైతే, పచ్చని ప్రకృతి ఒడిలోంచి వడివడిగా వస్తున్న ఆ చల్లని జలాల్లో ఈదులాడాలని ఉరకలెత్తేవారు కొందరు. ఆ తహతహే కొందరిని మృత్యువు తన ఒడిలోకి లాగేసుకుంటోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి పర్యాటక ప్రాంతానికి ఆదివారం ఏలూరు ఆశ్రమ్ వైద్య కళాశాలకు చెందిన 14 మంది విద్యార్థులు విచ్చేశారు. మారేడుమిల్లి జలతరంగిణి జలపాతంలో ఐదుగురు కొట్టుకుపోగా వీరిలో గాయత్రి పుష్ప, చింతా హరిణి ప్రియ గాయాలతో బయటపడిన విషయం తెలిసిందే. దీంతో పోలీసులు, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్‌కు చెందిన బృందాలు మొత్తం 40 మంది ఆదివారం సాయంత్రం నుంచి మిగిలిన ముగ్గురి కోసం తీవ్ర స్థాయిలో గాలించాయి. రెవెన్యూ, అగ్నిమాపక, అటవీ అధికారుల సమన్వయంతో నిరంతరాయంగా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. ఆదివారం అర్ధరాత్రి విజయనగరం జిల్లా బొబ్బిలి సమీపంలోని డొంకినవలస గ్రామానికి చెందిన బాలి అమృత (22) మృతదేహాన్ని కనుగొన్నారు. సోమవారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో బొబ్బిలికి చెందిన కొసిరెడ్డి సౌమ్య(21) మృతదేహాన్ని కనుగొన్నారు. మరొక విద్యార్థి ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన చింతకుంట్ల హరదీప్(20) ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశాల మేరకు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సోమవారం రాత్రి వరకు గాలింపు చర్యలు కొనసాగించాయి. రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి, డీఎఫ్‌వో బబిత, మారేడుమిల్లి సీఐ సీహెచ్ మురళీకృష్ణ, తహసీల్దారు కారం సుబ్బారావు గాలింపు చర్యలను పర్యవేక్షించారు.

ఎంత ఘోరం..

మెడికోలు ఆదివారం మధ్యాహ్నం ఒకటిన్నర-రెండు గంటల మధ్య ఇక్కడ స్నానాలకు దిగారు. అప్పటికే వర్షం మొదలైంది. దీనికితోడు కొండల్లోంచి భారీగా వరదనీరు ముంచెత్తింది. ఒక ఉప్పెన మాదిరిగా విలయతాండవం చేస్తూ ఒక్కసారిగా జలతరంగిణి భయోత్పాతం సృష్టించింది. మొత్తం 14 మంది మెడికోలకుగాను ఐదుగురు చిక్కుకుపోయారు. వీరిలో ఒకరు ఏదోలా బయటపడగా, మరొకరిని సమీపంలో కాజ్‌వే వద్ద రక్షించారు. ఇక మిగిలిన వారిలో అమృత మృతదేహం జలతరంగిణి నుంచి కొట్టుకుపోయి ఒకటవ కాజ్‌వే దాటిన తర్వాత ఇసుక దిబ్బ వద్ద లభ్యమైంది. ప్రవాహ వేగానికి రాళ్లకు కొట్టుకుపోవడంతో నుదుటి మీద, తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షణాల్లోనే మృతి చెందినట్టు భావిస్తున్నారు. అలాగే సౌమ్య మృతదేహం కూడా అదే ప్రాంతంలోని తుప్పల్లో చిక్కుకుపోయింది. సౌమ్యకు తీవ్ర గాయాలు కావడంతో పాటు ముఖం ఛిద్రమైంది. రాళ్ల దెబ్బలకు తగిన గాయాలకే ఆమె కూడా మృతి చెంది ఉండొచ్చని తెలుస్తోంది. జలఖడ్గంలా వచ్చిన పడిన ప్రవాహం అరగంటలో వర్షం తగ్గగా, కొద్దిసేపటికే కొంత తగ్గుముఖం పట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో ప్రవాహం మొదటి కాజ్‌వే ప్రాంతంలో ఏకంగా ఏడడుగులుపైనే ఉంటుందని చెబుతున్నారు. మళ్లీ సోమవారం మధ్యాహ్నం ఆకస్మికంగా వర్షం కురవడంతో జలతరంగిణి వద్ద ఒక్కసారిగా జలప్రవాహం పెరిగిపోయింది. దాంతో గాలింపు చర్యలను సైతం నిలిపివేయాల్సి వచ్చింది. సాయంత్రం వర్షం తగ్గాక మరొక విద్యార్థి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. జలతరంగిణి నుంచి పాములేరు వాగు వరకు సుమారు నాలుగు కిలోమీటర్లు ఉంటుంది. వాగు వంపులు తిరుగుతూ వెళుతుంది. దాంతో ప్రవాహ వేగాన్ని దృష్టిలో పెట్టుకుని గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. రెండో కాజ్‌వే వద్ద తూముల్లో కూడా గాలించారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా
జడ్పీ సీఈవోగా లక్ష్మణరావు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 23: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా వీవీ వీఎస్ లక్ష్మణరావు నియమితులయ్యారు. డ్వామా విజయనగరం జిల్లా గరివిడి క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పని చేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇంత వరకు ఇన్‌చార్జి సీఈవోగా పనిచేసిన కాకినాడ డీఎల్‌డీవో పి.నారాయణమూర్తి విశాఖపట్నం జిల్లా జడ్పీ సీఈవోగా బదిలీ అయ్యారు.

జడ్పీలో పారదర్శంగా అంతర్గత బదిలీలు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 23: జీవో నెం.75 మార్గదర్శకాలను అనుసరించి ఉమ్మడి జిల్లా జడ్పీలో పారదర్శకంగా అంతర్గత బదిలీలు చేపట్టామని జడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పేర్కొన్నారు. అంతర్గత బదిలీ అయిన జడ్పీ ఉద్యోగులకు సోమవారం తన చాంబర్‌లో ఆయన ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ ఇన్‌చార్జి సీఈవో పి. నారాయణమూర్తి, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు. ఎంపీడీవోలు 28 మంది, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు 40 మంది, సీనియర్ అసిస్టెంట్లు 61 మంది, జూనియర్ అసిస్టెంట్లు 91 మంది, టైపిస్టులు 41 మంది, రికార్డు అసిస్టెంట్లు 26 మంది, డ్రైవర్లు ఇద్దరు, ఓఎస్‌లు 67మంది, ఎల్‌జీఎస్‌లు నలుగురు.. మొత్తం 360 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు.

చిరుత పులి కదలికలు లేవు

డీఎఫ్‌వో భరణి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 23: తూర్పు గోదావరి జిల్లా దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో మూడు రోజులుగా చిరుతపులి కదలికలను ఏమీ గుర్తించలేదని జిల్లా అటవీ అధికారి ఎస్.భరణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివాన్‌చెరువు రక్షిత అటవీ ప్రాంతం, చుట్టుపక్కల ప్రాంతాల్లో 105 ట్రాప్ కెమెరాలు, 10 సీసీ కెమెరాలు, ఏడు ట్రాప్ బోనులను ఏర్పాటు చేశామన్నారు. అటవీ శాఖ బృందాలతో నిత్యం గాలిస్తున్నప్పటికీ ఈ నెల 20 నుంచి చిరుతపులి కదలికలు కెమెరాల్లో కనిపించలేదని స్పష్టం చేశారు. దివాన్‌చెరువు రక్షిత అటవీ ప్రాంతం చుట్టుపక్కల గ్రామాల ప్రజల నుంచి కూడా చిరుత కదలికలపై ఏ విధమైన సమాచారం రాలేదన్నారు. చిరుతపులి కదలికలను గుర్తించే ప్రక్రియను కొనసాగిస్తూనే ఉన్నామని డీఎఫ్‌వో చెప్పారు.

4.5 కిలోల గంజాయి స్వాధీనం
ముగ్గురు అరెస్టు

మోతుగూడెం, సెప్టెంబరు 23: అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా, చింతూరు సీఐ తెల్లం దుర్గాప్రసాద్ ఆదేశాల మేరకు వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి పోలీస్‌స్టేషన్ వద్ద సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. సీలేరు వైపు నుంచి డొంకరాయి వస్తున్న మహీంద్ర జైలో కారును ఆపి తనిఖీ చేశారు. అందులో రూ.23వేలు విలువైన 4.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణా చేస్తున్న కృష్ణా జిల్లాకు చెందిన తలారి మణికంఠ, లంకపల్లి మధుకుమార్, ఏలూరు జిల్లాకు చెందిన వడ్డాది మున్నిలను అదుపులోకి తీసుకున్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కారుతో పాటు రెండు మొబైల్స్ సీజ్ చేశారు.



శాంతి హోమం నిర్వహిస్తున్న పండితులు

సత్యదేవుని సన్నిధిలో శాంతి హోమం

అన్నవరం, సెప్టెంబరు 23: తిరుమలలో కల్తీ నెయ్యి వినియోగంపై అపరాధ నివారణ కోసం దేవదాయ శాఖ ఆదేశాలతో సోమవారం అన్నవరం దేవస్థానం పండితులు, అర్చకులు శాంతి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. వనదుర్గ ఆలయం వద్ద ఉదయం తొమ్మిది గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, మంటపారాధన జరిపి దేశ సుభిక్షం, లోక కల్యాణార్థం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. 11 గంటలకు హోమ గుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి తదితరులు వైదిక కార్యక్రమాలు నిర్వహించగా పీఆర్వో కృష్ణారావు, ఏపీఆర్వో గణపతి తదితరులు పాల్గొన్నారు.

యువత జీవితంలో క్రీడలు భాగం కావాలి: మంత్రి సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), సెప్టెంబరు 23: యువత జీవితంలో చదువుతో పాటు క్రీడలు భాగం కావాలని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో గరిగిపాటి జానకిరామయ్య స్మారక ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ సబ్ జూనియర్స్ బాలురు, బాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు ఆడుకోవడానికి ఆట స్థలాలు లేవన్నారు. కొన్నిచోట్ల కమర్షియల్ కాంప్లెక్సుల్లో పాఠశాలలు నిర్వహిస్తున్నారన్నారు. నేటి తరం పిల్లలు ఆటలకు సమయం కేటాయించకపోవడంతో చిన్నతనంలోనే పలు రుగ్మతలకు గురవుతున్నారన్నారు. తొలుత గరిగిపాటి జానకిరామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో కలిసి బాస్కెట్‌బాల్ ఆడారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి 14 బాలురు జట్లు, 8 బాలికల జట్లు పోటీలకు హాజరైనట్టు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గన్నమని చక్రవర్తి తెలిపారు. వీరిలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులతో జిల్లా జట్లు ఎంపిక చేస్తామన్నారు. జిల్లా స్థాయి జట్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, సంపతి సత్యనారాయణ పాల్గొన్నారు.



బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

కాకినాడ జీజీహెచ్‌లో క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 23: మహిళల్లో గర్భాశయ, రొమ్ము తదితర క్యాన్సర్లు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కాకినాడ జీజీహెచ్‌లోని గైనకాలజీ ఓపీడీ, ఎస్‌ఆర్‌ఎంటీ విభాగం వద్ద క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం ఏర్పాటు చేశారు. సోమవారం దీనిని పీఐఎన్‌సీసీ ప్రెసిడెంట్ జీన్‌టాల్బర్ట్ ఫాకోగ్, లీడ్ ఇండియన్ ఆపరేషన్స్ డాక్టర్ సమత కడియాలతో కలిసి కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్‌ను నివారించే లక్ష్యంతో జీజీహెచ్‌లోని ప్రసూతి, గైనకాలజీ, రేడియేషన్ ఆంకాలజీ-గ్లోబల్ (పీఐఎన్‌సీసీ) విభాగం సంయుక్తంగా ఈ స్క్రీనింగ్ శిబిరం నిర్వహిస్తోందన్నారు. ఈ నెల 26వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. వివిధ శాఖల్లో పని చేస్తున్న మహిళా సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్క్రీనింగ్ పరీక్షలకు హాజరయ్యే మహిళలు నెంబరుకు 8885253889 వాట్సాప్ లేదా rorm-ckkd@gmail.com మెయిల్ ఐడీకి తమ వివరాలు పంపించి నమోదు చేసుకోవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి కోరారు. కార్యక్రమంలో విశాఖపట్నం హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి రీసెర్చ్ సెంటర్ హెచ్‌వోడీ డోలోరోసా ఫెర్నాండెజ్, అమెరికల్ కాలేజ్ ప్రసూతి, గైనకాలజిస్ట్ డాక్టర్ సుసాన్ కోక్రాన్, డాక్టర్ కరోల్ హాబాచ్, జీజీహెచ్ రేడియేషన్ ఆంకాలజీ, ఓబీజీ విభాగాల హెచ్‌వోడీలు డాక్టర్ పి.శ్రీనివాసన్, డాక్టర్ అనురాగమయి, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ రుక్మిణి పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్

పులిపిరి(సురిడికాయ)కి అరుదైన చికిత్స

- ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు

కాకినాడ జిల్లా, సెప్టెంబర్ 23: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకుపసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. కాకినాడ మెయిన్ రోడ్, చందనాబ్రదర్స్ ఎదురుగా, జయరాం హీరో షోరూమ్ ప్రక్కన, హోటల్ శ్రీవాత్స, కాకినాడ నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 23, 24, 25,తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరి నైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. మంగళ, బుధవారం రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

నేడు పశ్చిమ మండల ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరం ఎంపికలు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 23: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మంగళవారం పశ్చిమ మండల ఎన్ఎస్ఎస్‌ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరం ఎంపికలు నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధికంగా నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో 290 ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఉన్నాయన్నారు. వీటి నుంచి హాజరయ్యే వారు ఎంపికల్లో సత్తా చాటాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధికారుల పర్యవేక్షణలో వివిధ పోటీలు నిర్వహించి ప్రతిభావంతులైన వారిని ఎంపిక చేస్తారని తెలిపారు. విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని ఎన్ఎస్ఎస్ విభాగాలు తమ తమ యూనిట్లలో ప్రతిభావంతులైన వలంటీర్లను ఎంపిక చేసి సెలక్షన్స్‌కు తీసుకు రావాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పి.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పీవోలు, వ్యాయామ విద్య విభాగం అధ్యాపకులు సంయుక్తంగా ఎంపిక ప్రక్రియ పూర్తిచేయాలని శ్రీనివాసరావు కోరారు.

రేపు 'నన్నయ'లో ప్రాంగణ ఎంపికలు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 23: హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఫార్మా కంపెనీ డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌లో ఉద్యోగాలకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో బుధవారం ప్రాంగణ ఎంపికలు జరుగుతాయని ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. 2023-24లో ఎమ్మెస్సీ ఆర్గానిక్, అనలిటికల్ కెమిస్ట్రీ, బీఎస్సీ మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీలో 60శాతం మార్కులతో ఉత్తీర్ణులైన విద్యా సంవత్సరంలో ఎటువంటి గ్యాప్‌లేని మహిళా అభ్యర్థులకు ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారన్నారు. అనలిటికల్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ విభాగంలో ఉద్యోగాలకు నిర్వహిస్తున్న ఈ ప్రాంగణ ఎంపికలను విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. ఎంపికైన వారికి అప్రెంటీస్ ట్రైనీ హోదాతో పాటు నెలకు రూ17,500 నుంచి 21,500 వరకు స్టైఫండ్ ఇస్తారు. 25వ తేదీ ఉదయం 10 గంటలకు నన్నయ వర్సిటీ సెమినార్ హాల్లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హతల ధ్రువపత్రాలు, ఆధార్ కార్డ్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలని కోరారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు అశ్విని ఎంపిక



అనపర్తి, సెప్టెంబరు 23: స్కూల్ గేమ్స్‌లో భాగంగా ఇటీవల కాకినాడలో జరిగిన యోగా అండర్-19 పోటీల్లో అనపర్తి బాలికోన్నత పాఠశాల విద్యార్థిని అశ్విని విశేష ప్రతిభ కనబరిచింది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పీఈటీ రాజేశ్వరి తెలిపారు. విద్యార్థినిని సోమవారం పీఈటీతో పాటు హెచ్ఎం కళ్యాణి, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందించారు.

మోటారు సైకిల్‌ను ఢీకొన్న లారీ

భార్య మృతి, భర్తకు గాయాలు... ఎర్రకోనేరు వద్ద ఘటన

బంధువుల ఇంటికి పరామర్శకు వెళ్తోస్తుండగా ప్రమాదం

తుని రూరల్, సెప్టెంబరు 23: కాకినాడ జిల్లా తుని రూరల్ పరిధిలోని 16వ నెంబరు జాతీయ రహదారి ఎర్రకోనేరు సెంటర్లో సోమవారం జరిగిన ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన పల్లి ఆదిలక్ష్మి (48) భర్త వెంకట్రావుతో కలిసి ఎస్.అన్నవరం గ్రామంలో బంధువులు ఇంటికి పరామర్శకు వెళ్లింది. తిరుగు ప్రయాణంలో వారి మోటారు సైకిల్‌ను ఎర్రకోనేరు వద్ద లారీ ఢీకొట్టింది. లారీ చక్రంలో ఇరుక్కున్న ఆదిలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. ఎగిరి రోడ్డు పక్కన పడ్డ భర్తని 108 అంబులెన్సులో తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, ఎస్ఐ కృష్ణమాచారి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ తప్పించుకుపోయే ప్రయత్నం చేయగా పోలీసులు చాకచక్యంగా వెంబడించి పట్టుకున్నారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.



ఆదిలక్ష్మి (పాత చిత్రం)



ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన విద్యార్థులు

టీటీ పోటీల్లో 'శ్రీప్రకాష్' విద్యార్థులకు పతకాలు

పెద్దాపురం, సెప్టెంబరు 23: కాకినాడ జిల్లా పెద్దాపురంలోని శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో మూడు రోజులు జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్-7 టేబుల్ టెన్నిస్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. అక్టోబరులో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. విజేతలను కోచ్‌లు వేణు, శ్రీరామ్, పాఠశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి సమీర, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, ఆకడమిక్ కో-ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

అండర్-14 బాలికల విభాగంలో నయన కొల్లి (కెప్టెన్), గీతాంజలి భైరవి, బాలుర విభాగంలో టి.సాయిశర్వాణ్ (కెప్టెన్), ఎ.సృజన్, వేద్ తివారి, అభిక్ భట్టాచార్య, అండర్-17 బాలుర విభాగంలో డి.ప్రహర్ష (కెప్టెన్), వెంకయ్యనాయుడు, గీతేష్, ఆయుష్మాన్ కాంస్య పతకాలు సాధించారు.

అండర్-17 బాలికల విభాగంలో ఎ.శాంతిజ్యోతి (కెప్టెన్), మౌపర్ణదాస్, సీహెచ్ సాయిశృతి, డి.నిషితసాయి, అండర్-19 బాలికల విభాగంలో టి.సాయిసుదీక్ష (కెప్టెన్), ఎం.దర్శిక, ధరణీ శ్రీకార్తికేయ, జాన్ రెజినా, బాలుర విభాగంలో పి.అశ్విన్, సీహెచ్ విజయ్‌ధర్, టీఎస్ఎస్ విఖ్యాత్, ఎం.వెంకటధనుష్ స్వర్ణ పతకాలు సాధించారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో బాపన్నదొర

మౌలిక వసతులు కల్పించండి

నీతి అయోగ్ సమావేశంలో వై.రామవరం ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం, సెప్టెంబరు 23: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని వై.రామవరం మండలం పూర్తిగా వెనుకబడి ఉందని, రహదారులు వేయడంతో పాటు మౌలిక వసతులు కల్పించాలని వై.రామవరం ఎంపీడీవో బాపన్నదొర విజ్ఞప్తి చేశారు. సోమవారం న్యూఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ నుంచి వై.రామవరం మండలాన్ని నీతి ఆయోగ్ బృందం గుర్తించింది. వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఎంపీడీవో బాపన్నదొర మాట్లాడుతూ తమ మండలంలో అనేక లోతట్టు గ్రామాలున్నాయన్నారు. 50 గ్రామాలకు మాత్రమే రహదారులున్నాయని, 90 గ్రామాలకు రహదారి సౌకర్యాలు లేవన్నారు. ఆయా గ్రామాల్లో ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న రోగులకు నేటికీ డోలీమోతలు తప్పడం లేదని, వాటి నుంచి విముక్తి కల్పించాలని కోరారు. గిరిజన గ్రామాల్లో విద్యా వసతులు, టెలికమ్యూనికేషన్, వ్యవసాయాభివృద్ధి, కరెంటు సౌకర్యాలను ఎంపీడీవో ప్రతిపాదించారు. మండలాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయాలని విన్నవించారు. సంపూర్ణత పోషణ అభియాన్‌పై గ్రామసభలు పెట్టి గిరిజనుల్లో చైతన్యం కల్పిస్తున్నామని బాపన్నదొర వివరించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కూటమి నాయకులు

జాతీయ టీ10 క్రికెట్ పోటీలకు ఎంపిక

బిక్కవోలు, సెప్టెంబరు 23: జాతీయ స్థాయి టీ10 క్రికెట్ పోటీలకు తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు నలుగురు ఎంపికైనట్టు హెచ్ఎం కేవీ రాఘవులు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టీ10 క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయన్నారు. ఇందులో ఆరుగురు విద్యార్థులు పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచారు. పదో తరగతి చదువుతున్న ఎస్కే సమీర్, జి.ఈనోష్, పి.శివసాయి, డి.దుర్గాప్రసాద్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అండర్-17 విభాగంలో జాతీయ స్థాయి టీ10 పోటీలకు ఎంపికయ్యారు. వీరు వచ్చే నెల 21వ తేదీ నుంచి మహారాష్ట్రంలోని నాసిక్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారు. విజేతలను, వారిని తీర్చిదిద్దిన పీడీ ఎండీ జావిద్‌కరిముద్దీన్‌ను కూటమి నేత నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ బర్ల శ్రీనివాస్ అభినందించారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం



కూటమి ప్రభుత్వ అభివృద్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

ప్రజా సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే శిరీషదేవి

మారేడుమిల్లి, సెప్టెంబరు 23: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి పేర్కొన్నారు. మండలంలోని సున్నంపాడు, దేవరపల్లి గ్రామాల్లో సోమవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' గ్రామసభల్లో ఆమె పాల్గొన్నారు. ప్రజల వద్దకు వెళ్లి కూటమి ప్రభుత్వం 100 రోజుల్లో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. పలు గ్రామాల గిరిజనులు సమస్యలతో కూడిన వినతి పత్రాలను ఎమ్మెల్యేకు అందజేశారు. నియోజకవర్గ పరిశీలకుడు చెల్లబోయిన శ్రీనివాస్, సర్పంచ్ వెలుగూరి చిన్న లచ్చిరెడ్డి, ఎంపీటీసీ మడకం అనిల్‌కుమార్, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు గురుకు శేషుకుమార్, జనసేన మండల అధ్యక్షుడు మళ్ల దుర్గాప్రసాద్, బీజేపీ మండల అధ్యక్షుడు రేవుల రామకృష్ణారెడ్డి, సీనియర్ నాయకుడు బీశెట్టి అప్పాజీ, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లాల రాజ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దేవీపట్నం: మండలంలోని ఇందుకూరు-1, పెద్దభీంపల్లి ఆర్‌అండ్‌ఆర్‌కాలనీ, మంటూరు, పరగసానిపాడు గ్రామాల్లో సోమవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి, దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి ఇంటింటికీ వెళ్లి వంద రోజుల పాలనలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని వివరించారు. ఎంపీడీవో రత్నకుమారి, ప్రత్యేకాధికారి ప్రశాంతి, మండల ప్రధాన కార్యదర్శి మట్ట మెహర్‌బాబాగౌడ్, నగేష్, ముచ్చు నాగేశ్వరరావు, దాకారపు సత్యనారాయణ, లంక హరిశ్చంద్రుడు, రేలంగి రాంబాబు, గేదెల పెదసుబ్బారావు, కారం పోశమ్మ, కల్యాణి, కొత్తపల్లి అన్నవరం, జొన్నల శ్రీనివాస్, తాతాజీ, పూడి రాజు, మాజీ సర్పంచ్ అబ్బు, కృష్ణ, పోసిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 90 అర్జీలు

రంపచోడవరం, సెప్టెంబరు 23: ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 90 అర్జీలు అందాయని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. సోమవారం ఆయన ఏపీవో (జీ) డీఎన్‌వీ రమణ, వివిధ శాఖల అధికారులతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రతి అర్జీనీ పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్నారు. చింతలపూడి కన్నేరువాగుకు కల్వర్టు ఏర్పాటు చేయాలని, చింత కొయ్య కూడలి-కొత్తూరు వరకు మెటల్ రోడ్డు వేయాలని, ఆకూరులో సీసీ రోడ్డు, పాఠశాల భవనానికి ప్రహరీ, అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు, కానివాడ పంచాయితీ పెద్దలోవ వీధిలో రబ్బరు ప్రాసెసింగ్ యూనిట్లు, వై.రామవరం మండలం కొత్తూరులో సెల్ టవర్, కొత్తూరు-బొడ్డగుంట వరకు రహదారి ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీలు అందించారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ బాబూరావు, తహసీల్దారు కృష్ణజ్యోతి, వెలుగు ఏపీడీ ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ ఇందిర, డీఎల్‌పీవో కె.కోటేశ్వరరావు, పీఏవో ఎల్.రాంబాబు, వ్యవసాయ శాఖ ఏడీ సీహెచ్‌కేవీ చౌదరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో 30న జాబ్‌మేళా



రంపచోడవరం, సెప్టెంబరు 23: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 30న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. సోమవారం ఆయన కరపత్రాలను ఆవిష్కరించారు. జాబ్‌మేళాలో ఐదు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. పూర్తి వివరాలకు 6304634447, 6281618037 నెంబర్లను సంప్రదించాన్నారు. కార్యక్రమంలో నైపుణ్యాధికారి జి.ప్రశాంత్‌కుమార్, కో-ఆర్డినేటర్ టి.ఆనందబాబు పాల్గొన్నారు.

'ఆదివాసీ పట్టభద్రులకు డీఎస్సీ ఉచిత కోచింగ్ ఇవ్వాలి'

దేవీపట్నం, సెప్టెంబరు 23: పీడీ, పీఈటీ శిక్షణ పొందిన ఆదివాసీ పట్టభద్రులకు రంపచోడవరం ఐటీడీఏ ఆధ్వర్యంలో డీఎస్సీ ఉచిత కోచింగ్ ఇప్పించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలంకు వినతిపత్రం అందజేశామని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ తెలిపారు. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం ప్రకటించాలన్నారు. మారుమూల గ్రామాలకు రోడ్లు మంజూరు చేయాలని, వెలగపల్లి వద్ద సీతపల్లి వాగుకు బ్రిడ్జి నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి కారం రామన్నదొర, మడకం వరప్రసాద్‌దొర, కె.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వెలుగు ఏపీఎం, సీసీల బదిలీ

కూనవరం, సెప్టెంబరు 23: వెలుగు కూనవరం ఏపీఎం భాస్కర్‌కు వై.రామవరం బదిలీ అయ్యింది. మిగతా నలుగురు సీసీలు రంపచోడవరం నియోజకవర్గంలోని వివిధ మండలాలకు బదిలీ అయ్యారు. దీర్ఘకాలికంగా ఇక్కడ తిష్టవేయడంతో వారిని బదిలీ చేసినట్టు తెలిసింది.

'ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

కూనవరం, సెప్టెంబరు 23: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి పాయం వెంకయ్య కోరారు. సోమవారం ఆయన మండలంలోని వివిధ గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు.



ఆంధ్రా బ్యాంకు సెంటర్లో రోడ్డుపై అడ్డంగా ఆవులు

రోడ్లపై పశువుల సంచారం

మోతుగూడెం, సెప్టెంబరు 23: మోతుగూడెంలో పశువుల యజమానులు పాలు తీసి వాటిని వదిలివేయడంతో రాత్రి, పగలు రోడ్లపైనే సంచరిస్తున్నాయి. దీంతో వాహనచోదకులు, బాటసారులు ఇబ్బంది పడుతున్నారు. ఆంధ్రా బ్యాంక్ సెంటర్లో బుధవారం గోవులు రోడ్డుపై అడ్డంగా నిలిచిపోయాయి. ఒక ద్విచక్ర వాహనచోదకుడు వాటిని తప్పించబోయి పక్కన ఉన్న మురుగు కాలువలో పడిపోయాడు. అటుగా వెళ్తున్న వారు ఆ వ్యక్తిని రక్షించడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పాఠశాలలకు వెళ్లడానికి పిల్లలు, రోడ్డుపై నడవడానికి వృద్ధులు భయపడుతున్నారు. పశువుల యజమానులు వాటిని రోడ్లపైకి వదలకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను కోరుతున్నారు.

ఏరులై పారుతున్న నాటుసారా



రాజవొమ్మంగి సెప్టెంబరు 23: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ నాటుసారా ఏరులై పారుతోంది. అటవీ ప్రాంతాల్లో కొందరు ఏర్పాటు చేసిన సారా బట్టీలు కుటీర పరిశ్రమలను తలపిస్తున్నాయి. పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా సారా వ్యాపారం ఏమాత్రం తగ్గట్లేదు. ప్రజలు తిరగబడి సారా బట్టీలను ధ్వంసం చేస్తున్నా సారా అరికట్టేందుకు అధికారులు ఏమాత్రం అధికారులు తీసుకోవట్లేదు. తమ భర్తలు సారాకు బానిసలై అనారోగ్యంతో చనిపోతుండడంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సారా నియంత్రణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా అధికారులు పట్టించుకోవట్లేదంటున్నారు. రాజవొమ్మంగి, జడ్డంగి పోలీస్ స్టేషన్లకు నూతన ఎస్‌ఐలు ఇటీవల బాధ్యతలు చేపట్టారు. వారైనా చర్యలు తీసుకుంటారని భావిస్తున్నారు.

లక్ష్మీగణపతి ఆలయంలో స్వచ్ఛతా హి సేవ

బిక్కవోలు, సెప్టెంబరు 23: బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయంలో సోమవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు ఈవో ఆకెళ్ల సత్య భాస్కర్ తెలిపారు. సిబ్బంది ఆలయ గ్రిల్స్ శుభ్రం చేశారు.

ఆక్రమణల తొలగింపు

కాతేరులో పదేళ్లుగా ఆక్రమించిన వారిని ఖాళీచేయించిన అధికారులు



మల్లయ్యపేటలో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యాలు



రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 23: రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామంలో ఆక్రమణల తొలగింపు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పంచాయతీ అధికారులు పోలీసుల సహకారంలో మల్లయ్యపేట, క్వార్టర్స్ గేటు వరకు రోడ్డుకు ఇరువైపులా రహదారిని ఆక్రమించి నిర్మాణాలు చేసిన వారిని ఖాళీ చేయించారు. రోడ్డు పైకి నిర్మాణాలు చేసి వాటిని కూల్చివేశారు. షెడ్లు, బడ్డీకొట్టులు, డ్రైనేజీలపై ఆక్రమణాలను తొలగించారు. మల్లయ్యపేట రోడ్డులో ఆక్రమణాలు పెరిగి రోడ్డు పూర్తిగా ఇరుకుగా మారడంతో అధికారులు ఈ రోడ్డుపై దృష్టిపెట్టి సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తొలగింపు పనులు చేపట్టారు. మల్లయ్యపేటలో బిర్యాయిని పాయింట్, తూమువద్ద ఆక్రమణలు, సెంట్రల్ బ్యాంక్ పక్కనే ఉన్న షెడ్లను తొలగించారు. దానవాయిబాబు ఆలయం సమీపంలో కూడా ఆక్రమణలు తొలగించారు. కాని కొన్నింటిని టచ్ చేయలేదు. మిగిలిన వాటిని కూడా ఖాళీ చేయించి రోడ్డుకు క్లీరెన్స్ ఇస్తే చాలా వరకు ఈ సెంటర్ విశాలంగా మారి ట్రాఫిక్ జామ్ కాకుండాను, వర్షాలు పడినప్పుడు రహదారిపైకి వర్షపు నీరు చేరకుండాను ఉంటుంది.

కల్తీ నెయ్యి కారకులను రాష్ట్ర బహిష్కరణ చేయాలి



జగన్ ఫ్లెక్సీకి నిప్పు పెడుతున్న కూటమి నాయకులు

రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు డిమాండ్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 23 : కలియుగదైవం శ్రీవెంకటేశ్వర స్వామి ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగానికి కారణమైన అప్పటి సీఎం జగన్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, వారికి సహకరించిన వారందరిని రాష్ట్ర బహిష్కరణ చేయాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం ఆజాద్‌చౌక్‌లో జగన్ ఫ్లెక్సీని సోమవారం దగ్ధం చేశారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్‌పై రాష్ట్ర ప్రజలు మండిపడుతున్నారన్నారు.అంబటి రాంబాబు అంబోతులా మాట్లాడడం మానుకోవాలన్నారు. వైసీపీ చేసిన నీచమైన పనులకు ఇంటికే పరిమితం చేశారు. ఇంకా సిగ్గులేకుండా బయటకు వచ్చి మాట్లాడుతున్నారంటే వాళ్లు మనుషులుకాదన్నారు. ప్రజల మనోభావాలను కాపాడే బాధ్యత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మజ్జి రాంబాబు, రెడ్డి మణి, దాస్యం ప్రసాద్, చాపన చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

అనపర్తిలో హిందూ సంఘాల భారీ ర్యాలీ

అనపర్తి, సెప్టెంబరు 23: టీటీడీ దేవస్థానం విశిష్టతను దెబ్బ తీసేందుకు జగన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన కుట్రలో భాగమే లడ్డూ ప్రసాదంలో జంతు అవశేషాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం అపవిత్రం చేసినందుకు నిరసనగా సోమవారం అనపర్తిలోని సనాతన ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు రెడ్డి సురేష్‌శర్మ నేతృత్వంతో భారీ ర్యాలీ నిర్వహించారు. కళావేదిక నుంచి గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా దేవీచౌక్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం కెనాల్ రోడ్డుపై ఎమ్మెల్యే సహా భక్తులు బైఠాయించి నిరసన తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం తిరుమల కొండపై చేసిన అకృత్యాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయన్నారు.

రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

పలుచోట్ల ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలు

అనపర్తి/ రంగంపేట, సెప్టెంబరు 23: రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం అనపర్తి మండలం చిన పొలమూరులో ఈవోపీఆర్డీ పద్మజ అధ్యక్షతన, రంగంపేట మండలం జి.దొంతమూరు గ్రామంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలకు ఆయన విచ్చేసి మాట్లాడారు. ఏదైనా కొత్త ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలానికి గాని ప్రజల్లోకి వెళ్లే ధైర్యం చేయరని, కాని కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలోనే ఎంతో అభివృద్ధి సాధించి ధైర్యంగా ప్రజల ముందుకు వచ్చిందన్నారు. విజయంలో తనకు అండగా నిలిచిన నియోజకవర్గ ప్రజలకు చేయాల్సిన మంచిని చేసి చూపిస్తానన్నారు. ఈ సందర్భంగా విజన్-2047 పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. జి.దొంతమూరు-రంగంపేట, సింగంపల్లి-రంగంపేట రోడ్ల పనులు దాదాపు పూర్తయాయన్నారు. రంగంపేట, వడిశలేరు గ్రామాల్లో దేవాలయాలను సుమారు రూ.3 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. దొంతమూరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఆళ్ల గోవింద్, నీలపాల త్రిమూర్తులు, ఎలుగుబంటి సత్తిబాబు, ఎం.సాయిరాం, సత్తిబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అనపర్తి: చినపొలమూరులో విజన్-2047 పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

వందరోజుల ప్రగతి వివరించేందుకే : వాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 23: నగరంలోని 6,30,31,32,33 డివిజన్లకు సంబంధించి స్థానిక జాంపేట ఆజాద్‌చౌక్‌లో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విచ్చేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వంద రోజుల పాటు చేసిన ప్రగతిని ప్రజలకు వివరించడానికే ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెడుతూ చివరి లబ్ధిదారుడి వరకు చేరుకునే విధంగా చిత్తశుద్ధితో అమలు చేస్తోందన్నారు. అనంతరం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాలరాయుడు, కాశి నవీన్ కుమార్, కుడుపూడి సత్తిబాబు, రెడ్డి మణి, చాన్ బాషా, మాలే విజయలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ అణచివేత చర్యలకు స్వస్తి : బత్తుల

సీతానగరం, సెప్టెంబరు 23: మండలంలోని చినకొండేపూడిలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరితో కలసి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ విచ్చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ అణచివేత చర్యలకు స్వస్తి చెప్పి ప్రజలకు భావ ప్రకటన స్వేచ్ఛను తిరిగి తెచ్చామని అన్నారు. ప్రజలకు స్వేచ్ఛను ఇవ్వడంతో పాటు 100 రోజుల్లో 100 అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను అమలు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

కోరుకొండ: బూరుగుపూడిలో సొసైటీ మాజీ అధ్యక్షుడు కంటే నాగకేశవరావు, పంచాయతీ కార్యదర్శి జాకబ్‌రాజు, పంచాయతీ అధికారులు, టీడీపీ నాయకులు. ప్రజలను కలుసుకుని ప్రభుత్వం 100 రోజుల్లో చేసిన కార్యక్రమాలను వివరించారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



కడియం: కడియపులంకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియపులంక అభివృద్ధికి ప్రణాళికలు : గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్/కడియం: రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు, కడియం మండలం కడియపులంకలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలకు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి విచ్చేసి మాట్లాడారు. 100 రోజుల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నెరవేర్చిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళుతున్నామన్నారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన నర్సరీలకు నిలయమైన కడియపులంక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని, ఇంటింటికీ మంచినీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పొలం పిలుస్తోంది పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో మత్యేటి ప్రసాద్, కామిని ప్రసాద్‌చౌదరి, కామిని బాస్కరరావు, భీమరశెట్టి రమేష్, వెలుగుబంటి ప్రసాద్, పాటంశెట్టి రాంజీ, మార్గాని సత్యనారాయణ, పంతం గణపతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలోనూ సంక్షేమమే : జ్యోతుల

గోకవరం, సెప్టెంబరు 23: మండలంలోని కృష్ణునిపాలెంలో నిర్వహించిన కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ విచ్చేసి మాట్లాడారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలోని పలు ఇళ్లకు స్టిక్కర్లు అంటించడంతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పొలం పిలుస్తోంది పోస్టర్‌ను ఆవిష్కరించారు. వైసీపీ ప్రభుత్వ హయంలో ఇచ్చిన నివాసయోగ్యం కాని జగనన్న ఇళ్ల పట్టాలను తమకొద్దంటూ పలువురు లబ్ధిదారులు తహశీల్దార్‌కు తిరిగి ఇచ్చేశారు. కార్యక్రమంలో కన్నబాబు, మంగరౌతు రాము, దాసరి తమ్మన్నదొర, ఉంగరాల రాము, తుమ్మలపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భూములకు పట్టాలు మంజూరు చేయాలి

గోకవరంలో సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో ఆందోళన

గోకవరం, సెప్టెంబరు 23: మండలంలోని భూపతిపాలెంలో ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలకు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం గోకవరంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం జరిగింది. ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు మాట్లాడుతూ భూపతిపాలెంలో 42,43,45, 46,47 సర్వే నెంబర్లలో ఉన్న భూములను మల్లవరం, కలిజోళ్లపేటకు చెందిన వైఆర్‌సీ నిర్వాసితులు, ఎస్సీ ఎస్టీ రైతులు 25 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారన్నారు. వారందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండు చేశారు. అనంతరం పలు డిమాండులతో కూడిన వినతిపత్రాన్ని ఆందోళనకారులు తహశీల్దారుకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు జగ్గంపూడి రాజా, నాగులపల్లి అచ్చారావు, రమణ, మరిడయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎమ్మెల్యేలపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

జిల్లా కలెక్టరేట్ వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో ధర్నా

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, సెప్టెంబరు 23: ఇద్దరు ఎమ్మెల్యేలపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్ వద్ద సోమవారం బీఎస్పీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా పట్నాల మాట్లాడుతూ కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ఉమామహేశ్వరరావుపై అమానుషంగా దాడిచేసిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీపైన, బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించి ప్రజలను రెచ్చగొట్టిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు పైన అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని, వారి శాసన సభ సభ్యత్వాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు చిర్రా రాజు, నక్కా వెంకటరత్నం, రాజమండ్రి ఇన్‌చార్జి ఇసుకపట్ల రాంబాబు, నిడదవోలు అధ్యక్షుడు బయ్యా మునేంద్ర, రూరల్ అధ్యక్షుడు గడ్డం ప్రసాద్, కొవ్వూరు అధ్యక్షుడు దుర్గేష్, ఆశీర్వాదం, జిత్తుగ రాజేష్, సీహెచ్ ప్రసాద్, ఎం.చిన్నబాబు, జాన్, ఐఎల్‌టీడీ మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికే ఉపాధి శిక్షణ : గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 23: మహిళలు ఆర్థికంగా బలపడేందుకే స్వయం ఉపాధి శిక్షణ దోహదపడుతుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. బొమ్మూరులోని ఎన్టీ రామారావు మహిళా ప్రాంగణంలో మహిళలకు నిర్వహిస్తున్న స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఇంటి వద్దనే ఉంటూ అనేక వృత్తులు చేసుకోవచ్చని, శిక్షణా శిబిరంలో 20 రకాల వృత్తులకు శిక్షణ ఇస్తున్నారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, పీడీ విజయ్‌కుమారి, ప్రత్యేకాధికారి జ్యోతి, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, సీడీపీవో నరసమ్మ పాల్గొన్నారు.

చేపల దొంగలపై చర్యలు తీసుకోవాలి

కోరుకొండ పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన

కోరుకొండ, సెప్టెంబరు 23: నిడిగట్ల ఎస్సీ ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీకి చెందిన చెరువులో చేపలు దొంగతనంగా పట్టుకెళ్లడంతో గ్రామానికి చెందిన మత్స్యసహకార సంఘం సభ్యులు, దళితులు, కోరుకొండ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసనకు దిగారు. గ్రామంలోని శరభన్న చెరువులో కొంత కాలంగా చేపలను దొంగిలిస్తున్నారని, దీంతో కాపలా కాసి దొంగలను పట్టుకోగా జనసేన నాయకుడు అనుచితంగా ప్రవర్తించి తమను కులం పేరుతో దూషించారన్నారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 100 మందికి పైగా దళితులు స్టేషన్ వద్దకు చేరి నిరసన చేపట్టారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

అనపర్తి, సెప్టెంబరు 23: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా సోమవారం అనపర్తిలోని కళావేదికలో పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 300మంది పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీలో నూతనంగా ఎంపికైన సభ్యులను సత్కరించారు.

హోటళ్లు అపరిశుభ్రంగా ఉంటే..

రూ.17,500 ఫైన్

రాజమహేంద్రవరం కమిషనర్ కేతన్‌గార్గ్



రాజమహేంద్రవరం సిటీ,సెప్టెంబరు 23: నగరంలో ఉన్న హోటల్స్, రెస్టారెంట్లలో అపరిశుభ్ర వాతవరణ కనిపిస్తే రూ.17,500 అపరాధ రుసుము విధిస్తామని వారిపై చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తింటే రోగాలే.. బయట ఫుడ్ నో సేఫ్ శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. నగరంలో మూడు బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టామని ఎవ్వరు నిబంధనలు అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలో తనిఖీలు చేసి 10 హోటల్స్‌కు నోటీసులు జారీ చేశామని, 2 చోట్ల ఫుడ్ శాంపిల్స్ సేకరించామన్నారు. అలాగే హోటల్స్, రెస్టారెంట్లలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడానికి కృషి చేస్తున్నామన్నారు. ముందుగా ఆహార విక్రయ కేంద్రాల వారిని అప్రమత్తం చేశామని చెప్పారు. నగరంలో ఏర్పాటు చేసిన మూడు కమిటీలు జవాబుదారీతనంతో పనిచేసి ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించేందుకు కృషి చేయాలన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 39 అర్జీలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం(మీ కోసం) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో ఎస్పీ నరసింహ కిషోర్ స్వయంగా మాట్లాడి సమస్యపై ఆరా తీశారు. అర్జీదారుల సమక్షంలో ఆయా పోలీస్‌స్టేషన్ల బాధ్యులకు ఫోన్ చేసి తగు ఆదేశాలిచ్చారు. మొత్తం 39అర్జీలను సంబంధిత అధికారులకు పంపించారు. త్వరగా చట్టపరిధిలో పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ అనసూరి శ్రీనివాసరావు, ఎస్ఐ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కోరుతూ అర్జీలు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 23: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ప్రజల నుంచి కమిషనర్ కేతన్ గార్గ్ అర్జీలను స్వీకరించారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరిగిన ఈ కార్యక్రమంలో అత్యధికంగా నగరంలో డ్రైనేజీలు, రహదారులు, తాగునీరు, వీధి దీపాలు, ఇళ్ల స్థలాల కోసం ప్రజలు తమ ఫిర్యాదులను కమిషనర్‌తోపాటు అడిషనల్ కమిషనర్ సత్యవేణిలకు అందించారు. వాటిని పరిశీలన చేసిన అధికారులు సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

విద్యార్థులకు యోగా సాధనపై అవగాహన

బిక్కవోలు, సెప్టెంబరు 23: విద్యార్థులందరూ ప్రకృతి సహజంగా పని చేస్తూ విద్యాభ్యాసం చేయాలని రాయవరం విశ్వమానవత సంస్థ అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి సూచించారు. సోమవారం పందలపాక, కొంకుదురు ఉన్నత పాఠశాలల్లో ఆయన విద్యార్థులకు యోగా సాధన వల్ల ఉపయోగాలు, పెరటి తోటల పెంపకం, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. అనంతరం కొంకుదురులో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి రోగులను పరీక్షించి 90 మందికి మందులు అందజేశారు.

పవన్‌కల్యాణ్ దీక్షకు మద్దతుగా పూజలు

కడియం, సెప్టెంబరు 23: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో వైసీపీ ప్రభుత్వం హయాంలో కల్తీ నెయ్యి వాడి అపవిత్రం చేయడాన్ని, హిందువుల మనోభావాలు దెబ్బతీయడాన్ని నిరసిస్తూ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ 11 రోజుల పాటు చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా కడియంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నాయకులు పూజలు చేపట్టారు. ధనార్జనే ధ్యేయంగా పనిచేసే వ్యక్తులను కాకుండా సేవా దృక్పథంతో పనిచేసే వ్యక్తులను ఆలయంలో నియమించాలని కోరారు. కార్యక్రమంలో చిరుకూరి నాగేశ్వరరావు, ఆకుల శ్రీధర్, బొర్సు సుబ్రహ్మణ్యం, గ్రీన్‌లాండ్ బాబి, నరమామిడి సాయిరాం, తమ్మిశెట్టి ప్రసాద్, గారపాటి తాతబ్బాయి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ప్రత్యేక వైద్యశిబిరం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 23: రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో సోమవారం పారిశుధ్య కార్మికులకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. జీజీహెచ్‌లో పనిచేస్తున్న శానిటేషన్ పనివారితోపాటు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న శానిటరీ కార్మికులకు ఈ సందర్భంగా వైద్య పరీక్షలు చేశారు. ఓపీ నమోదు, బీపీ, షుగర్, ఇతర సాధారణ వైద్యపరీక్షలు చేపట్టారు. రక్తపరీక్షల రిపోర్టులు వచ్చిన తర్వాత సంబంధిత అనారోగ్యాలకు వైద్యులు మందులు రాసి పంపించారు. ఆర్ఎంవో డాక్టర్ ప్రణవ్ ఆధ్వర్యంలో జీజీహెచ్, అర్బన్ హెల్త్ సెంటర్లకు చెందిన వైద్య సిబ్బంది ఈ వైద్యశిబిరంలో సేవలందించారు.

సీతానగరంలో గంగాలమ్మ జాతర

సీతానగరం, సెప్టెంబరు 23: సీతానగరంలోని లంకల్లో ఉన్న గంగాలమ్మ జాతరను లంకూరు గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి, పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం గోదావరిలో తెప్పోత్సవం నిర్వహించి అమ్మవారిని గోదావరిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 23: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సోమవారం మన యూనియన్ సభ్యులు రూ.30 వేలను సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందించారు. కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ చినరాములును కలిసి డీడీని అందించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బేతాన గణేష్‌కుమార్, రాజేష్, పిల్లి శ్రీనివాస్, నక్కా సూర్యనారాయణ, ఎస్‌వీఎస్ బాలు, లోవరాజు పాల్గొన్నారు.

పిడుగు పాటుకు వ్యక్తి మృతి

రంగంపేట, సెప్టెంబరు 23: మండలంలోని వడిశలేరులో పిడుగు పాటుకు ఓ వ్యక్తి మృతి చెందాడని వీఆర్వో ఎం.పద్దయ్య తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 2గంటల సమయంలో గ్రామంలోని పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న పొలం చూడడానికి వెళ్లిన వైట్ల నరేంద్రరాంబాబు(బుల్లిపండు) (45) వర్షం రావడంతో పొలంలో ఉన్న మామిడిచెట్టు కింద ఉన్న బల్లపై కూర్చుండగా ఒకే సారి పెద్ద శబ్ధంతో పిడుగు పడింది. ఆ శబ్ధానికి బయపడి చనిపోయాడని వీఆర్వో తెలిపారు. కాగా బుల్లిపండుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వంద రోజుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష

రాజమహేంద్రవరం రూరల్/సిటీ, సెప్టెంబరు 23: విజన్-2047 మండల స్థాయి డాక్యుమెంటేషన్ అందజేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం వంద రోజుల ప్రభుత్వ పురోగతిపై శాఖల వారీగా కలెక్టర్ సమీక్ష చేశారు. గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధుల సమక్షంలో గ్రామసభలు నిర్వహించాలన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజల అభిప్రాయాల సేకరణ చేయాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో సాధించాల్సిన లక్ష్యాలను సమీక్షించారు. ఉపాధి హామీ పనులు పురోగతిపై సమీక్షించారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యసాధనలో ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. 27నుంచి 29 వరకు మానవ వనరులపై సమీక్షించారు.సమావేశంలో డీఆర్వో జి.నరసింహులు,అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 24 సెప్టెంబరు 2024 | 5





దీపావళి నుంచి మూడు సిలిండర్లు
'ఇది మంచి ప్రభుత్వం'లో మంత్రి దుర్గేష్

నిడదవోలు, సెప్టెంబరు 23 : అర్హులందరికీ దీపావళి నుంచి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించనున్నామని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు మండలం డి.ముప్పవరం గ్రామంలో సోమవారం "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమం నిర్వహించారు.ఇంటింటికి వెళ్లి స్వయంగా ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లు అతికించారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్లలో చేయలేని పనులు కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే చేసిందన్నారు.ఇది పేదల ప్రభుత్వమన్నారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాబోయే రోజుల్లో మరిన్ని మంచి పనులు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి దుర్గేష్, ఎంపీడీవో శామ్యూల్, తహశీల్దార్ నాగరాజు నాయక్, రంగా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

7

కలలు.. కల్లలయ్యాయి!
మెడికోలను చిదిమేసిన జలఖడ్గం

కలలు కల్లలయ్యాయి.. ఆశలు ఆవిరయ్యాయి.. చిన్నపాటి నిర్లక్ష్యం.. భవిష్యత్‌లో ఎంతో మందికి ఊపిరిపోయాల్సిన వారి ఊపిరినే తీసేసింది.. కుటుంబీకులకు తీరని శోకం మిగిల్చింది.. నిన్నటి వరకూ మా అమ్మాయి డాక్టర్ చదువుతుందంటూ ఎంతో గర్వంగా చెప్పుకున్న ఆ తల్లిదండ్రుల నోటమాట రావడంలేదు.. కళ్ల నుంచి ఉబికి వచ్చే కన్నీళ్లు ఆగడంలేదు.. తమ కళ్లెదుటే కొట్టుకుపోయారని.. ఎక్కడో ఒక చోట నుంచి తిరిగి వస్తారని ఆశగా ఎదురుచూసిన స్నేహితులకు కన్నీరే మిగిలింది.. తాము చూస్తుండగానే ఆనందంగా వాగులో దిగి గల్లంతైన ముగ్గురిలో ఇద్దరు విగతజీవులుగా కనిపించడాన్ని తట్టుకోలేకపోతున్నారు.. వెళ్లిపోదాం లేవండిరా అంటూ స్నేహితుల మృతదేహాలను పట్టుకుని వాళ్ల వెంట వచ్చిన స్నేహితులంతా కన్నీటిపర్యంతమయ్యారు. మారేడుమిల్లి జలతరంగిణి వాగు వద్ద క్షణాల్లో పెరిగిన నీటి ఉధృతికి ముగ్గురు ఆశ్రం మెడికల్ కాలేజీ విద్యార్థులు గల్లంతైన ఘటన విదితమే. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థినుల మృతదేహాలు లభ్యం కావడంతో ఆ ప్రాంతమంతా హృదయవిదారకంగా మారింది.. తోటి స్నేహితులు.. విద్యార్థినుల బంధువులను ఆపడం ఎవరి వల్లా కాలేదు.. మరొకరి ఆచూకీ ఇంకా లభించాల్సి ఉంది.




గల్లంతైన వారి ఆచూకీ కోసం సోమవారం వాగులో వెతుకుతున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది



సౌమ్య



అమృత



హరిదీప్



అన్నవరంలో.. అవినీతి!

దేవస్థానంలో నెయ్యికి 'నోట్ల' తడి

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

- నెయ్యి నాణ్యతపై అనుమతులు నిల్
- జిల్లా ఆహార కల్తీ నిరోధకశాఖ తనిఖీల్లేవ్
- నేటికీ అనామక కంపెనీ నుంచే నెయ్యి
- కాంట్రాక్టర్‌కు అడ్డగోలు సహకారం
- తిరుపతి ఘటనతో మేల్కొన్న ప్రభుత్వం
- నెయ్యి సరఫరాలో సమూల మార్పులు
- ప్రస్తుత కంపెనీని తప్పించాలని నిర్ణయం
- వచ్చే నెల నుంచి కొత్త కాంట్రాక్టర్ రాక
- ఇకపై విజయ డెయిరీ నెయ్యి కొనుగోలు?
- సింహాచలానికి విశాఖ డెయిరీ నెయ్యి
- డిప్యూటీ సీఎం పవన్‌తో చర్చలు
- అన్నవరం నెయ్యి శాంపిళ్లు బెంగళూరుకు
- మరో 20 రోజుల్లో రానున్న నివేదిక

అన్నవరం దేవస్థానంలో వినియోగించే నెయ్యి నాణ్యతపై ఆలయ అధికారుల ఉదాసీనత అనేక అనుమానాలకు తావిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో అడ్డగోలు కంపెనీకి నెయ్యి సరఫరా కాంట్రాక్టు కట్టబెట్టిన ఆలయ అధికారులు అసలు నాణ్యతను పట్టించుకోలేదు. అంతేకాదు.. నెయ్యి నాణ్యతపై జిల్లా ఆహార కల్తీ నిరోధకశాఖ అనుమతులు లేవు. తాజాగా తిరుపతి లడ్డూలో వినియోగించి నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందని తేలిన నేపథ్యంలో అన్నవరంలో నెయ్యి నాణ్యతపై ఆరా తీస్తే అనేక చేదు నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అన్నవరం నెయ్యిని సైతం ప్రక్షాళనచేయాలని నిర్ణయించింది. కమీషన్లకు కక్కుర్తి పడి అనామక కంపెనీకి కట్టబెట్టిన నెయ్యి కాంట్రాక్టును పూర్తిగా తొలగించాలని భావిస్తోంది. ఇక ప్రభుత్వ డెయిరీ నుంచే నేరుగా నెయ్యి కొనుగోలు చేయాలని నిర్ణయించింది. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో విజయ డెయిరీని రంగంలోకి దించబోతున్నారు. ప్రస్తుత నెయ్యి నాణ్యత నిగ్గుతేల్చడానికి శాంపిళ్లను బెంగళూరు ల్యాబ్‌కు తరలించారు.

నెయ్యి పేరుతో నోట్లు మింగుడు...

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అన్నవరం దేవస్థానం ఎంతో ప్రఖ్యాతి చెందింది. ఏటా లక్షల్లో భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి వస్తారు. ఒక్క ప్రసాదమే ఏటా రెండు కోట్ల ప్యాకెట్లు అమ్ముడవుతాయి. ఇక్కడి ప్రసాదం అంటే భక్తులకు అంత ప్రీతి. అందుకే దేవస్థానంలో ప్రసాదం తయారీకి ఏటా 18 లక్షల కిలోల నెయ్యి అవసరం ఉంటుంది. కానీ అధికారులు ఈ నెయ్యిలో కోట్లలో నోట్ల వేట సాగించారు. ఆరు నెలలకోసారి ఒక్కొక్క కాంట్రాక్టర్ నుంచి నెయ్యి సరఫరా జరగాల్సి ఉంటే.. గత వైసీపీ ప్రభుత్వంలో ఓ అనామక కంపెనీ నుంచి ఏకంగా రెండేళ్ల పాటు అధికారులు నెయ్యి కొనుగోలు చేశారు.అసలు ఆ కంపెనీకి అంత నెయ్యి సరఫరా చేసే సామర్థ్యం లేకపోయినా కాంట్రాక్టు కట్టబెట్టేశారు. ఇదే కాంట్రాక్టరు పక్కనే సింహాచలం దేవస్థానానికి కిలో నెయ్యి రూ.344కి సరఫరా చేస్తే అన్నవరం దేవస్థానానికి ఏకంగా రూ.538కి విక్రయించారు. ఈ రెండేళ్లలో సదరు కాంట్రాక్టర్‌కు సింహాచలంతో పోల్చితే ఏకంగా రూ.7.80 కోట్ల వరకు గీకేశాడు. అంతేకాదు తాజాగా మరో కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. దేవస్థానానికి సరఫరా అయిన నెయ్యిని నిబంధనల ప్రకారం ఆలయ అధికారులు జిల్లా ఆహార కల్తీ నియంత్రణ శాఖ ద్వారా తనిఖీ చేయించాలి. నెయ్యి వచ్చిన వెంటనే ఆ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. అధికారులు వచ్చి నెయ్యి నాణ్యత పక్కాగా ఉందని ధ్రువీకరించిన తర్వాతే వినియోగించాలి.కానీ దేవస్థానం అధికారులు అసలు ఈ పని చేయలేదు.ఆ శాఖతో సంప్రదింపులు చేయ లేదు. నెయ్యి సరఫరా అయిన ప్రతిసారీ తనిఖీ చేయిస్తే ఎక్కడ నాణ్యత బయటపడి తమ బండారం బట్టబయలు అవుతుందోననే భయంతో అడ్డగోలుగా వ్యవహరించారు. పూర్తిగా నిబంధనలకు తూట్లు పొడిచారు. అనామక నెయ్యి సరఫరా కాంట్రాక్టరు తనకు అనుకూలంగా తెచ్చుకున్న దొంగ నాణ్యత సర్టిఫికెట్‌నే నమ్మి నెయ్యి కొనుగోలు చేయడం అనేక అనుమానాలకు తావిస్తోంది. అసలే ఆరు నెలలకోసారి మారాల్సిన కాంట్రాక్టర్ మారకపోవడం, ఇతర ఆలయాలతో పోల్చితే అధిక చెల్లింపులు, పైగా నెయ్యికి తనిఖీలు చేయించకపోవడం వెనుక ఎన్ని కోట్ల లో కమీషన్లు చేతులు మారాయనేదానిని రుజువు చేస్తోంది.



ఇకపై సమూల మార్పులు..

తిరుపతి లడ్డు తయారీలో గత వైసీపీ ప్రభుత్వం జంతు కొవ్వులు కలిసిన నెయ్యిని వినియోగించిన ఘటన బట్టబయలు కావడంతో రాష్ట్రప్రభుత్వం అప్రమత్తమైంది. అన్నవరం దేవస్థానంలోను ఇకపై నెయ్యి నాణ్యత పెంచాలని నిర్ణయించింది. వైసీపీ హయాం నుంచి అడ్డగోలుగా కొనసాగుతున్న ప్రస్తుతం రైతు డెయిరీ కాంట్రాక్టర్‌కు నెయ్యి సరఫరా గడువు ఈనెలతో ముగుస్తోంది. తిరిగి వచ్చే నెల నుంచి మరో కొత్త కాంట్రాక్టర్ రంగంలోకి దిగుతున్నారు. ఈలోపే నెయ్యి నాణ్యతపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోబోతోంది. అందులో భాగంగా ప్రభుత్వ విజయ డెయిరీ నుంచి మొత్తం నెయ్యిని కొనుగోలు చేయాలని దాదాపు నిర్ణయానికి వచ్చింది. ఈ మేరకు జిల్లా మంత్రి అయిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి విజయ నుంచి నెయ్యి కొనుగోలు ప్రతిపాదన తీసుకువెళ్లారు. అదే సమయంలో సింహాచలం దేవస్థానానికి అన్నవరం ఆలయానికి సరఫరా చేస్తున్న కాంట్రాక్టరే నెయ్యి సరఫరా చేస్తుండడంతో ఆయన్ను తప్పించి విశాఖ డెయిరీ నుంచి కొనుగోలు చేయాలని సోమవారం నిర్ణయం తీసుకున్నారు.ఈ నేపథ్యంలో పవన్ దృష్టికి ఈ వ్యవహారాన్ని తీసుకువెళ్లబోతున్నారు. తద్వారా విజయ, విశాఖలో ఏదనేది నిర్ణయించనున్నారు. విజయ డెయిరీ వైపే మొగ్గు చూపే అవకాశాలున్నాయి. అన్నవరం దేవస్థానంలో జిల్లా ఆహార కల్తీ నిరోధకశాఖ అధికారులు ఆదివారం తనిఖీలు చేసి నాలుగు నెయ్యి శాంపిళ్లు సేకరించారు. నాణ్యతను నిగ్గు తేల్చడానికి హైదరాబాద్‌లోని స్టేట్ ల్యాబ్, మరింత లోతైన విశ్లేషణకు బెంగళూరులోని కేంద్ర ల్యాబ్‌కు పంపించారు. 20 రోజుల్లో వీటికి సంబంధించి పూర్తిస్థాయి నివేదికలు రానున్నాయి.

కాకినాడ కలెక్టర్ ఆగ్రహం..

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ నెయ్యి నాణ్యత విషయమై ఆగ్రహంగా ఉన్నారు. ఇప్పటికే జిల్లా ఆహారకల్తీ నియంత్రణశాఖ అధికారులను పిలిపించి మాట్లాడగా అసలు నెయ్యి నాణ్యతపై ఏ రోజూ తమ ద్వారా తనిఖీలు జరగలేదనే విస్తుగొలిపే వాస్తవాలు బయటకు వచ్చాయి. తమకు దేవస్థానం నుంచి అసలు ఎప్పుడూ సమాచారం లేదని కలెక్టర్‌కు వివరించారు. ఒకరకంగా ఇది పూర్తిగా నిబంధనల ఉల్లంఘనే అని తేల్చిచెప్పాలి. తిరుపతి ఘటన నేపథ్యంలో ఇకపై ఆలయానికి వచ్చే నెయ్యిని ఆహార కల్తీ నియంత్రణశాఖ అనుమతించి పక్కాగా ఉందని నిర్ధారించిన తర్వాతే వినియోగించేలా జిల్లా ఆహార కల్తీ నిరోధక శాఖ ఆలయ ఈవోకు రాతపూర్వకంగా లేఖ రాయబోతోంది.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్నరాముడు..

అర్జీదారులతో కిక్కిరిసిన కలెక్టరేట్ ప్రాంగణం

కలెక్టరేట్‌కు అర్జీదారుల క్యూ

- కొత్త పింఛన్లు, రేషన్‌కార్డులు ఇప్పించాలని వినతులు
- 450 మంది నుంచి అర్జీలు స్వీకరించిన కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ/రూరల్ ,సెప్టెంబరు 23 : కలెక్టరేట్‌కు కొత్త పింఛన్లు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని కోరుతూ పలువురు అర్జీదారులు పోటెత్తారు. గత మూడు వారాలుగా ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సక్రమంగా జరగడం లేదు. ఒక వారం వర్షాభావం కారణంగా ప్రజలు రాలేకపోయారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "మీ కోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా పలు మండలాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున చేరుకున్నారు. కలెక్టరేట్ వద్ద ప్రజలు బారులు తీరారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 450 మంది నుంచి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జేసీ చిన్నరాముడులు అర్జీలు స్వీకరించారు.కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

- చాగల్లు మండలం దారవరానికి చెందిన పాతూరి సుబ్బారావు తమ గ్రామ నెం-1 స్కూల్‌లో విద్యార్థులకు తగ్గట్టుగా టీచర్లు లేరని కేవలం ముగ్గురు ఉపాధ్యాయులతో కాలం వెళ్లదీస్తున్నారని వినతిపత్రం ఇచ్చారు.
- నిడదవోలు బాలికల హాస్టల్ వార్డెన్ రాజామణి విద్యార్థులకు సక్రమంగా భోజనాలు పెట్టడం లేదని ఫిర్యాదు చేశారు.ముప్పవరం గౌడ్‌పేటకు చెందిన పి.సత్యనారాయణ గ్రామంలో చెరువుగట్టున సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహాన్ని పెట్టుకునేందుకు అనుమతివ్వాలని కోరారు.
- దేవరపల్లికి చెందిన భూపతిరాజు కొవ్వూరు డిపోలో ఆర్‌టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.అతనికి అనారోగ్య సమస్యలతో ఉండగా డిపో మేనేజరు చార్జుకు విరుద్ధంగా డ్యూటీలు వేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు.
- సీతానగరం మండలం బొబ్బిలంక సర్పంచ్ మొల్లి రామచంద్రరావు ఇటీవల వచ్చిన గోదావరి వరదలకు శ్మశాన వాటిక కోతకు గురైందన్నారు. ప్రస్తుతం గ్రామంలో సుబ్బారావుపేట, జేజే నగర్, అశోక్‌నగర్‌లకు చెందిన దళితులు ఎవరైనా మరణిస్తే అంతిమ సంస్కారాలకు ఇబ్బందులు పడుతున్నామన్నారు.
- పలువురు దివ్యాంగులు రూ.15 వేల పింఛను మంజూరు చేయాలని అర్జీలు పెట్టుకున్నారు.



కలెక్టరేట్‌లో మొక్కనాటుతున్న కలెక్టర్ ప్రశాంతి, గోరంట్ల

ప్రతి మండలంలో మొక్కలు నాటేందుకు
25 సెంట్ల స్థలం సేకరించాలి..

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 23 : పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా అకీరా మియావాకీ కార్యక్రమాన్ని చేపట్టినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 2600 మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఉపాధి హామీ పథకం కింద అకీరా మియావాకీ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. కనీసం ప్రతి మండలంలో ఐదు నుంచి పది వరకు ప్రదేశాలను గుర్తించి కనీసం 25 సెంట్ల స్థలంలో ఈ మొక్కలు పెంపకానికి చర్యలు తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో డీఆర్వో జి.నరసింహులు, డ్వామా ఇన్‌చార్జీ పీడీ ఆర్.శ్రీరాములు,జిల్లా అధికారులు ఎస్.మాధవరావు, ఎన్‌వీవీఎస్.మూర్తి, జి.స్వామినాయుడు, కెఎస్.జ్యోతి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో నాకిది.. నీకది..?
బదిలీల్లో వినూత్నంగా పంపకాలు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 23 : రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో బదిలీలు వినూత్నంగా సాగాయి. ఒకరికొకరు సర్దుబాటు చేసేసుకున్నారు. నీకది.. నాకిది అంటూ పంచేసుకున్నారు.తమకు నచ్చినసీటు.. ఇబ్బందిలేకుండా సాధించుకున్నారు.బదిలీలంటే ఇలా కూడా జరుగుతాయా అని ఆశ్చర్యపోయేలా రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో జరిగాయి. అసలేం జరిగిందటే.ప్రస్తుతం రాజమహేంద్రవరం కార్పొరేషన్ సిటీ ప్లానర్‌గా మూర్తి పనిచేస్తున్నారు. ప్రస్తుత బదిలీల్లో భాగంగా ఆయనను రాజమహేంద్రవరం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు.ఆయన స్థానంలో రుడా పీవో కోటయ్యను టౌన్‌ప్లానింగ్ సిటీప్లానర్‌గా నియమించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్లుగా పనిచేస్తున్న కృష్ణ, హరిబాబు, అనితాజూలీ బదిలీ అయ్యారు. వీరిలో అనితా జూలీ రుడాకు బదిలీ అయ్యారు. కృష్ణను టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్‌కు బదిలీ చేశారు. హరిబాబు విజయనగరం మునిసిపాలిటీకి బదిలీ అయ్యారు. అంటే వీరిలో కేవలం ఒక్కరు మాత్రమే విజయనగరం వెళ్లారు. మిగిలిన వారంతా ఇక్కడే ఉండడం గమనార్హం. ఈ విషయం తెలిసినవారంతా బదిలీలు ఇలా కూడా జరుగుతాయా అని ఆశ్చర్యపోతున్నారు.

మైన్స్ ఏడీగా ఫణిభూషణ్‌రెడ్డి

జిల్లా మైన్స్ ఏడీగా డి.ఫణిభూషణ్‌రెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుత ఏడీ ఎం.సుబ్రహ్మణ్యం ఆర్‌వీఎస్‌గా (రీజనల్ విజిలెన్స్ స్క్వాడ్) బదిలీ అయ్యారు. తూర్పుగోదావరి జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారిగా డి.ఫణిభూషణ్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయన శ్రీకాకుళం నుంచి ఇక్కడకు వస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ మైన్స్ అండ్ జియాలజీ అధికారిగా ఉన్న ఎం.సుబ్రహ్మణ్యంను కడపకు బదిలీ చేశారు.



నేటి నుంచి పొలం పిలుస్తోంది

- వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల క్షేత్ర సందర్శన
- ఇకపై వారంలో రెండు రోజులు నిర్వహణ

రాజానగరం, సెప్టెంబరు 23 : వరి సాగులో తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం "పొలం పిలుస్తోంది" కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా వారంలో ప్రతి మంగళ, బుధవారాల్లో రోజుకు రెండు గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించేలా ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ శాఖలైన మత్స్య, ఉద్యాన, పట్టు, పరిశ్రమ,సేంద్రియ, మార్కెటింగ్ శాఖల అధికారులు పొలంబాట పట్టే దిశగా ప్రభుత్వం సంకల్పించింది. ఆధునిక పంటలపై దృష్టి సారించేలా చర్యలు చేపట్టడంతో పాటుగా సంబంధిత వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నదాతలను కలిసి సాగు కష్టాలు తెలుసుకుని నూతన దిగుబడులపై అవగాహన కల్పిస్తారు. ఖరీఫ్, రబీ సాగుల్లో నాలుగు నెలల పంతున "పొలం పిలుస్తోంది" నిర్వహించేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. అధికారులు రైతు వద్దకు వెళ్లి పంట పరిశీలనతో పాటు లోపాలు గుర్తిస్తారు. ఈ వివరాలు రాష్ట్రస్థాయి అధికారులు పరిశీలించనున్నారు. పంట దిగుబడి తగ్గడానికి కారణాలు తెలుసుకోవడం, సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి భూసారం పెంచేలా సూచనలు చేయడం, భూసార కార్డుల పంపిణీ, తుంపర, బిందు సేద్యం పథకం దిశగా ప్రోత్స హించడం చేస్తారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీ, రైతు మిత్ర సంఘాల ఏర్పాటు, వ్యవసాయ సంఘాల ద్వారా రుణాలు మంజూరు, ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించడం, రసాయన ఎరువుల వినియోగం తగ్గించేలా అవగాహన కల్పించనున్నారు. వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉన్న 14 శాఖల సేవలు వినియోగించుకోవాలని ప్రభుత్వం సూచించింది. రాజానగరం వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిం మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



ట్రాక్టర్‌లో చెత్తను తరలిస్తున్న దృశ్యం

చెత్తను తొలగించారు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన పంచాయతీ

దేవరపల్లి, సెప్టెంబరు 23: ఎక్కడ చెత్త అక్కడే అన్న శీర్షికతో ఆదివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. సోమవారం పలు ప్రధాన కూడళ్ల వద్ద పేరుకుపోయిన చెత్తకుప్పలను తొలగించారు. పోలీస్‌స్టేషన్ సమీపంలోని చైతన్య స్కూల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గోపాలపురం రోడ్డులో చెత్త పేరుకుపోవడంతో వాహనదారులు, విద్యార్థులు భవిష్యత్తులో ఎలాంటి రోగాలు వస్తాయోనని భయాందోళన చెందుతున్నారు. వారి ఆందోళనను దృష్టిలో పెట్టుకుని పంచాయతీ కార్యదర్శి హుటాహుటీన సోమవారం అక్కడి చెత్తను తొలగించారు.



నిడదవోలులో నియోజకవర్గ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్


క్రీడాకారులకు ప్రభుత్వం అండ

నిడదవోలు, సెప్టెంబరు 23: విద్యార్థులు చదువు, క్రీడల్లో ఆకాశమే హద్దుగా రాణించాలని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం నిడదవోలు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిడదవోలు నియోజకవర్గ క్రీడా పోటీలతో పాటు, సెలక్షన్స్‌ను రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. విద్యార్థి దశ నుంచే క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలన్నారు. నిడదవోలులో త్వరలో మినీ స్టేడియం ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాలకు చెందిన అండర్ 14, 17 బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్, యోగా, చెస్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్కూల్ గేమ్స్ కో ఆర్డినేటర్ ఎస్.నరసింహులు, జనసేన నాయకులు డాక్టర్ తోపరాల కళ్యాణ్ చక్రవర్తి, రంగా రమేష్, మాట్ల వెంకట దుర్గారావు, స్వరూపాదేవి. పి.పుల్లంరాజు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

చాగల్లు, సెప్టెంబరు 23: స్థానిక అశోక్‌నగర్‌లోని 61వ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం జరిగింది. సెక్టార్ సూపర్‌వైజర్ పీవీ పద్మావతి మాట్లాడుతూ తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడి సిబ్బంది నీలిమ, విజయ కుమారి, గంగాభవాని, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో గుండెపోటుతో కానూరు యువకుడి మృతి



చిలుకూరి శ్రీ రాఘవదొర

పెరవలి, సెప్టెంబరు 23: ఎన్నో ఆశలతో అమెరికా వెళ్లిన ఆ యువకుడిని గుండెపోటు రూపంలో మృత్యువు కబలించింది. కానూరుకు చెందిన చిలుకూరి శ్రీరాఘవ దొర(24) మూడేళ్ల క్రితం అమెరికాలో ఎంఎస్ చేసేం దుకు వెళ్లారు. చదువు పూర్తి చేసుకుని ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నారు. అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో నల్లాకులో ఉన్న అతనికి గుండెపోటు రావడంతో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. యువకుడి తాత ఉండ్రాజవరం మండలం చివటం టీడీపీ నాయకుడు చిలుకూరి వీర రాఘవులు కాగా, నడిపల్లి మాజీ ఉపసర్పంచ్ ఈదుగంటి దొరయ్య అతని తల్లి తరుపు తాత. చివటం నుంచి వచ్చి కుటుంబ సమేతంగా ఇక్కడే నివసిస్తున్నారు. గతంలో ఇతని తండ్రి చిలుకూరి ప్రకాశరావు గుండెపోటుతో మృతి చెందారు. యువకుడి సోదరుడు ఇక్కడే చదువు పూర్తిచేసి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. కానూరులో తల్లి చిలుకూరి మణిప్రియ నివసిస్తున్నారు. యువకుడి మరణవార్త తెలియడంతో కానూరు, నడిపల్లి గ్రామాలతోపాటు ఉండ్రాజవరం మండలం చివటంలో విషాద చాయలు అలుముకున్నాయి. యువకుడి మృత దేహాన్ని మంగళవారం కానూరు తీసుకు వస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

చాగల్లు, సెప్టెంబరు 23: మండలంలోని చిక్కాలకు చెందిన సంసాని గంగరాజు(43) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ కే.నరేంద్ర తెలిపారు. ఆయన వివరాల ప్రకారం...మృతుడు గంగరాజు అదే గ్రామానికి చెందిన పెదపాటి పండుతో గొడవపడ్డాడని తెలిపారు. దీంతో మనస్తాపం చెంది ఆదివారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. అతని భార్య కోట సత్యవతి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించామన్నారు. అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, సీఐ విజయరాజు సంఘటనా స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.



చీపురుగూడెంలో వంద రోజుల పాలనపై వివరిస్తున్న కూటమి నాయకులు

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

కొవ్వూరు, సెప్టెంబర్ 23: పారిశుధ్య కార్మికులకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించినట్లయితే పట్టణ, గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుతారని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మున్సిపాల్టీ, పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.సాయికిరణ్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, సూర్యదేవర రంజిత్, మద్దిపాటి సత్యనారాయణ, బీజేపీ నాయకులు పరిమి రాధ, పిల్లలమర్రి మురళీకృష్ణ, బోడపాటి ముత్యాలరావు, ఎం.రామచంద్రరావు, పిక్కి నాగేంద్ర, గెల్లా కేశవ, గండ్రోతు పవన్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో లాభాలెన్నో...

దేవరపల్లి, సెప్టెంబరు 23: సేంద్రియ వ్యవసాయంతో పండించిన ఆకుకూరలు, కాయగూరలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని గోపాలపురం డివిజన్ ప్రకృతి వ్యవసాయ శాఖ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ అన్నారు. దేవరపల్లిలో పంచాయతీ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరల స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్రతీ సోమవారం ఈ స్టాల్స్‌ను పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేస్తామన్నారు. క్రిమిసంహారక రహిత ఆహార ఉత్పత్తులను ప్రజలు అధికంగా కొంటున్నారని తెలిపరు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు సత్యనారాయ, రామలక్ష్మి, ఉప్పలపాటి ప్రసన్న, రాధా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



దొమ్మేరు గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, సెప్టెంబర్ 23: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కొవ్వూరు పట్టణంలోని 16వ వార్డు ఔరంగాబాద్, మండలంలోని దొమ్మేరు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు, కూటమి ప్రభుత్వం అందించిన పథకాలను ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో సూరపనేని చిన్న, కౌన్సిలర్ కండెల్లి రామారావు, పాకా జయరామ్, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, సర్పంచ్ తానేటి కుమారి, ఉప సర్పంచ్ కలగర సుబ్బారావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, యలమర్తి శ్రీరాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పెరవలిలో నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

హామీలన్నీ అమలుచేస్తాం

పెరవలి, సెప్టెంబరు 23: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఇచ్చిన హామీలను చాలా వరకు నెరవేర్చిందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. పెరవలిలో ఇంటింటికి తిరుగుతూ ఇది మంచి ప్రభుత్వం

ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి

అంటూ ప్రభుత్వ కార్యక్రమాలను వివరిస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు సలాది కృష్ణమూర్తి, సలాది శ్రీహరి, బొడ్డు రామాంజనేయులు, పిప్పర రవి పాల్గొన్నారు.

నేడు ప్రజా వేదిక: ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం కాకరపర్రులో ప్రజావేదిక ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో పర్యాటకశాఖ మంత్రి దుర్గేష్, జిల్లా కలెక్టర్ ప్రశాంతి, నిడదవోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు పాల్గొంటారని పార్టీ నాయకులు తెలిపారు.

నేడు పొలం పిలుస్తోందికి శ్రీకారం: జిల్లా వ్యాప్తంగా మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయా గ్రామాల్లో నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాన్ని కాకరపర్రులో మంత్రి లాంఛనంగా ప్రారంభిస్తారని వ్యవసాయ శాఖ అధికారులు తెలిసారు.



తాళ్లపూడిలో పోస్టరును అందిస్తున్న కూటమి నాయకులు

వంద రోజుల పాలన భేష్

తాళ్లపూడి, సెప్టెంబరు 23: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వంద రోజుల కూటమి పాలన దిగ్విజయంగా పూర్తి చేసిందని వక్తలన్నారు. అన్నదేవరపేట గ్రామంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో కూచిపూడి హనుమంతరావు, కూచిపూడి గణేష్, చెవ్వూరి బంగార్రాజు, పేరూరి రమణ, షైనం గంగరాజు, కవల రామాంజనేయులు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు. పోచవరం గ్రామంలో చలపాటి ప్రకాష్ ఆధ్వర్యంలో పిట్టా రాము, కాకర్ల సురేష్ తదితరులతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై హర్షాతిరేకాలు



కరిచర్లగూడెంలో ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను చూపిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు తదితరులు

చాగల్లు, సెప్టెంబరు 23: వంద రోజుల కూటమి పాలనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ళ హరిబాబు అన్నారు. సోమవారం పలు వీధుల్లో పర్యటించి ఇది మంచి ప్రభుత్వం అంటూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అల్తాఫ్ అహ్మద్, ఆళ్ళ సూర్యప్రకాశరావు, కోటేశ్వరరావు, జనసేన సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

గోపాలపురం, సెప్టెంబరు 23: గోపాలపురం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందంజలో ఉంచుతానని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. కరిచర్లగూడెంలో నిర్వహించిన బహిరంగ సభలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మగ్బుల్ బాష అధ్యక్షతన సోమవారం మండలంలోని చెరుకుమిల్లి, వెంకటాయపాలెం, చిట్యాల, పెద్దాపురం, వేలచింతలగూడెం, భీమోలు, గోపాలపురం, వాదాలకుంట, కోమటికుంట, కరిచర్లగూడెం, గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంతో పాటు పలు అభివృద్ధి పనులకు భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా కరిచర్లగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, జడ్పీటీసీ కాకులపాటి లలిత, మండల బీసీ సెల్ అధ్యక్షుడు నాగరాజు, అనిశెట్టి త్రిమూర్తులు, ఎంపీడీవో ఆర్.శ్రీదేవి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



చాగల్లులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కూటమి నాయకులు

సమస్యల పరిష్కార వేదికకు 5 ఫిర్యాదులు

కొవ్వూరు, సెప్టెంబర్ 23: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అయిదు ఫిర్యాదులు స్వీకరించినట్లు కొవ్వూరు ఇన్‌చార్జి ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. డివిజన్ పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన వారి నుంచి అయిదు పిర్యాదులను స్వీకరించారు. ప్రజల పిర్యాదులను తక్షణం పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలు ప్రభుత్వ శాఖల డివిజనల్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

లడ్డూ కల్తీకి పాల్పడిన బాధ్యులను శిక్షించాలి

దేవరపల్లి, సెప్టెంబరు 23: తిరుపతి లడ్డూ పవిత్రతను దెబ్బతీసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ దేవరపల్లిలో శివాలయం వద్ద సమరసత సేవా ఫౌండేషన్, ఆదిశంకరాచార్య జ్ఞానమందిర కమిటీ, మానవత సంస్థ సభ్యులు, వివిధ ఆలయాల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ



దేవరపల్లిలో కొవ్వూరు ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న భక్తులు

నిర్వహించారు. శివాలయం దర్శనానికి వచ్చిన కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు వీరికి సంఘీభావం తెలిపారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. అనంతరం ఈ ర్యాలీ శివాలయం నుంచి బస్టాండ్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో సమరసత ఫౌండషన్ మండల అధ్యక్షుడు వెలగా శ్రీరామచంద్రమూర్తి, కొవ్వూరు డివిజన్ ధర్మప్రచార కమిటీ సభ్యుడు మాధవరావు, ఆల్ ఇండియా విష్ణు సహస్రనామ డైరెక్టర్ బలుసు సత్యనారాయ, వివిధ ఆలయాల కమిటీ సభ్యులు చలంచర్ల వీరవెంకట హరినాథ్, తోట సత్యనారాయణ, ఓరుగంటి లక్ష్మీపతిరాజు, కంబాల సత్తిబాబు, మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కల్తీ నెయ్యి దోషులను శిక్షించాలి

కొవ్వూరు, సెప్టెంబర్ 23: తిరుపతి లడ్డూలో కల్తీకి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని టీడీపీ జిల్లా పార్టీ మాజీ కార్యదర్శి కె.వి.కె. రంగారావు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం కమీషన్లకు కక్కుర్తిపడి కల్తీ నెయ్యి వాడారన్నారు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కానరాని చిరుతపులి కదలికలు

జిల్లా అటవీ అధికారి భరణి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 23: తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో మూడు రోజులుగా చిరుతపులి కదలికలు ఏమీ గుర్తించలేదని జిల్లా అటవీ అధికారి ఎస్.భరణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివాన్‌చెరువు రక్షిత అటవీ ప్రాంతం, చుట్టుపక్కల ప్రాంతాల్లో 105 ట్రాప్ కెమెరాలు, 10 సీసీ టీవీ కెమెరాలు, ఏడు ట్రాప్ బోనులను ఏర్పాటు చేసి అటవీశాఖ బృందాలతో గాలిస్తున్నప్పటికీ ఈ నెల 20 నుంచి చిరుతపులి కదలికలు కెమెరాల్లో కనిపించలేదని స్పష్టం చేశారు. అలాగే దివాన్‌చెరువు రక్షిత అటవీ ప్రాంతం చుట్టుపక్కల గ్రామాల ప్రజల నుంచి కుడా చిరుతపులి కదలికలు గురించి ఏవిధమైన సమాచారం రాలేదన్నారు. ఇప్పటికీ చిరుతపులి కదలికలు గుర్తించే ప్రక్రియను కొనసాగిస్తూనే ఉన్నామని డీఎఫ్‌వో పేర్కొన్నారు.

విగ్రహాల ఏర్పాటుపై విచారణ

తాళ్లపూడి, సెప్టెంబరు 23: మండలంలోని వేగేశ్వరపురంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల గేటు వద్ద అల్లూరి సీతారామరాజు, ఝాన్సీ లక్ష్మీబాయి విగ్రహాల ఏర్పాటుపై వచ్చిన ఫిర్యాదు మేరకు విద్యాశాఖ డీవైఈవో రామన్నదొర సోమవారం విచారించారు. పూర్వపు విద్యార్థులు అంబటి కృష్ణ తదితరుల ఫిర్యాదుపై విచారించేందుకు వచ్చామన్నారు. ఈ విచారణలో ఆయన వెంట ఎంఈవో బాలామణి, ఎంఈవో2 నెహ్రూజీ ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకి సాయి జోత్స్న



మెమొంటో అందిస్తున్న దృశ్యం

నల్లజర్ల, సెప్టెంబరు 23: రాష్ట్రస్థాయి మహిళ క్రికెట్ జట్టుకి ఇ.సాయిజోత్స్న ఎంపికవడం హర్షణీయమని నల్లజర్ల ఎస్ఆర్‌కే కళాశాల చైర్‌పర్సన్ కంఠమణి వసుంధరదేవి అన్నారు. సోమవారం నల్లజర్ల యస్ఆర్‌కే కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల పేదవేగిలో నిర్వహించిన జిల్లాస్థాయి పరుగు పందెంలో సంధ్యన ప్రథమస్థానం సాధించినట్లు చెప్పారు. గత సంవత్సరం బోర్డు పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహంతోపాటు మెమొంటో అందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గన్నమని దొరయ్య, సుంకర సుబ్బారావు, కొఠారి ఆంజనేయ చౌదరి, దుగ్గిన లీలాకృష్ణ, కోఠారి గాంధీ, కోరా కన్నయ్య పాల్గొన్నారు.

గుబ్బాలమ్మ అమ్మవారి హుండీ ఆదాయం లెక్కింపు



గుబ్బాలమ్మ అమ్మవారి హుండీని లెక్కిస్తున్న దృశ్యం

నిడదవోలు, సెప్టెంబరు 23: నిడదవోలు మండలం గోపవరం గ్రామంలోనున్న గుబ్బాల మ్మ అమ్మవారి ఆలయంలో సోమవారం హుండీల లెక్కింపు నిర్వహించారు. సుమారు రెండు నెలల 12 రోజులకు గాను రూ.1,20,850 ఆదాయం లభించినట్లు ఆలయ మేనేజర్ నామా సూర్యప్రకాశరావు తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎ.సుజన్‌కుమార్ ఆధ్వర్యంలో జరగ్గా ఈ కార్యక్రమంలో ఆరేపల్లి చిన నంగాలు, ఉపసర్పంచ్ అరుగుల శ్రీనివాస్, నీలం శ్రీనివాస్, పి.వెంకన్న ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వంద రోజుల పాలన భేష్

నల్లజర్ల, సెప్టెంబరు 23: వంద రోజుల కూటమి పాలన ప్రశంసనీయమని పలువురు వక్తలన్నారు. సోమవారం చీపురుగూడెంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులతో కలిసి ఇంటింటికి వెళ్ళి 100 రోజుల పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు చెల్లు పెద్దరామన్న, బీజేపీ మండలాధ్యక్షుడు చెల్లు సత్యనారాయణ, జనసేన మండల కార్యదర్శి చెల్లు సత్యనారాయణ(పండు), టీడీపీ సీనియర్ నాయకులు కూసంపూడి బుజ్జి, చెల్లు వీర వెంకట్రావు, ప్రతిపాటి రాంబాబు, జనసేన నాయకులు చెల్లు సుబ్రహ్మణ్యం, జవ్వాది పల్లపరాజు, టీడీపీ నాయకులు తలంశెట్టి రామకోటి, మోదుగ సుబ్బారావు, యర్రా జగదీష్, వల్లేపల్లి వీర్రాజు, చెల్లు బాబూరావు, రాంబాబు పాల్గొన్నారు,

ఇద్దరు ఎమ్మెల్యేలపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, సెప్టెంబరు 23: ఇద్దరు ఎమ్మెల్యేలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్ వద్ద సోమవారం బీఎస్పీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ఉమామహేశ్వరరావుపై అమానుషంగా దాడిచేసిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పైన, అంబేద్కర్ ఫ్లెక్సీని తొలగించిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు పైన అట్రాసిటీ కేసులు నమోదు చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు చిర్రా రాజు, నక్కా వెంకటరత్నం, రాజమండ్రి ఇన్‌చార్జి ఇసుకపట్ల రాంబాబు, నిడదవోలు అధ్యక్షుడు బయ్యా మునేంద్ర, రూరల్ అధ్యక్షుడు గడ్డం ప్రసాద్, కొవ్వూరు అధ్యక్షుడు దుర్గేష్, ఆశీర్వాదం, జిత్తుగ రాజేష్, సీహెచ్ ప్రసాద్, ఎం.చిన్నబాబు, జాన్, ఐఎల్‌టీడీ మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై శిక్షణ

దేవర పల్లి, సెప్టెంబరు 23: రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని తక్కువ ఖర్చుతో ప్రకృతి వ్యవసాయాన్ని చేయవచ్చని ప్రకృతి వ్యవసాయ అధికారి సత్యనారాయణ అన్నారు. సోమవారం దేవరపల్లిలో పిచ్చుకల పల్లేశ్వరరావు పొలంలో డ్రోన్‌తో స్ప్రేయింగ్ చేసే కార్యక్రమాల్ని రైతులకు వివరించారు. ఈ ప్రకృతి వ్యవసాయంలో రసాయనాల వాడకం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రసన్న, సురేఖ తదితరులు పాల్గొన్నారు.



ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

కొవ్వూరు, సెప్టెంబర్ 23: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కొవ్వూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు 12 మంది ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు ఆర్.పద్మశ్రీ తెలిపారు. ఈ నెల 21న దేవరపల్లి మండలం పల్లంట్లలో జరిగిన పశ్చిమ గోదావరి జిల్లా ఎస్‌జీటీ ఫుట్‌బాల్ 14, 17 సంవత్సరాల బాలబాలికల పోటీలలో పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్. భాస్కర్‌ను హెచ్‌ఎం పద్మశ్రీ అభినందించారు. పదిహేడు సంవత్సరాల విభాగంలో సీహెచ్ కావేరి, టి.తేజశ్రీ, యు. హేమవర్షిత, ఎ.శుభశ్రీ, ఎస్.మనోజ్, బి.ఉదయ కిరణ్ ఈ నెల 28వ తేదీ నుంచి 30 వరకు పల్నాడు జిల్లా వినుకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. పద్నాలుగు సంవత్సరాల విభాగంలో వి.నాగరాజు, డి.దుర్గాప్రసాద్, పి.వెంకటేష్, పి.దివ్యశ్రీ, ఈ.శ్రీలత, ఆర్.లిఖిత అక్టోబర్‌లో సత్యసాయి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు.

దళిత నాయకుల నిరసన

కొవ్వూరు, సెప్టెంబర్ 23: ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు, కాకినాడ ఎమ్మెల్యే పంతం నానాజీలను పదవుల నుంచి తొలగించాలని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్ డిమాండ్ చేశారు. సోమవారం కొవ్వూరు పట్టణంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతాయుతమైన పదవులలో ఉంటున్న వారిద్దరు హుందాగా ఉండాలన్నారు. ఈ నిరసనలో బి.ప్రతాప్, ఎం.ధనరాజు, డి.అనీల్ తదితరులు పాల్గొన్నారు.